డా॥ వేంపల్లి గంగాధర్

ఎర్రచందనం దారిలో తమిళ కూలీలు

SHOUT
SHARE
IT

ఎర్రచందనం దారిలో తమిళ కూలీలు

డా॥ వేంపల్లి గంగాధర్

గాయత్రి ప్రచురణలు
2019

ఎర్రచందనం దారిలో
తమిళ కూలీలు

డా॥ వేంపల్లి గంగాధర్

e-mail : gangadhar.vempalli@gmail.com

© Writer

ప్రథమ ముద్రణ : మే 2019

డి.టి.పి. : సుధాకర్ కె నాయుడు, బెంగుళూరు

కవర్ డిజైన్ : గంగవరం కొండారెడ్డి

ప్రచురణ : గాయత్రి ప్రచురణలు

ప్రతులకు : జూటూరు తులసీదాస్
బాలల అభ్యుదయ వేదిక
1-3-482, ఎస్.వి.ఎన్.ఆర్. అపార్ట్‌మెంట్
ఎదురుగా, 4వ రోడ్, రంగస్వామి నగర్,
అనంతపురం జిల్లా, సెల్: 9848859954
విశాలాంధ్ర, నవచేతన అన్ని బ్రాంచిలలో
నవోదయ బుక్‌హౌస్.

వెల : రూ. 50/-

ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్-20.
ఫోన్ : 040-27678411

"చారిత్రక సమయంలో మనం జీవించి ఉన్నప్పుడు
నడుస్తున్న చరిత్ర మనకు చరిత్రలాగే కనపడదు"

– జాన్ డబ్ల్యు గార్డనర్.



'ఎర్రచందనం దారిలో తమిళ కూలీలు' మొదటిభాగం 6 మే 2015 నాడు 'చందనసీమకు చీకటి దారులు' శీర్షికతో సాక్షి దినపత్రిక సంపాదకీయ పేజీలో వెలువడింది. అలాగే మే 7వ తేదీన 'దేవతా వనాలకు పట్టిన దెయ్యాల పీడ' శీర్షికతో రెండవ భాగం ప్రకటితమైంది. 31 మే 2015 నాటి ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో 'కల్పవృక్షం కనుమరుగు' శీర్షికతో కవర్ స్టోరీ కథనం ప్రచురితమైంది.

"POLICE DEPARTMENT"

From

Sri S.Trimurthulu,
Addl. Supdt. of Police(Admin),
Public information officer,
Urban Police District,
Tirupati.

To

Sri Dr. V. Gangadhar
D.No.4-432-A,
Vivekanandhanagar,
Kadapa-516001

C.No.G1/1507/27/RTI Act/TPT(U)/2015, Dt : -05-2015

Sir,

Sub:- RTI Act 2005 – Application dt: 02-05-15 of Dr.Vempalli Gangadhar, r/o Kadapa seeking FIR copy related to the encounter on red sanders at sachhinodibunda & chikatikona of seshchalam forest, Tirupati on 07-04-15 under RTI ACT 2005 –reply sent-Reg.

Ref;- 1.Application dt: 02-05-15 of Dr. Vempelli Gangadhar, r/o kadapa received in this office on 07-05-15.
2.G1/2067/69/RTI Act/2014 dt: 14-05-15 of Supdt. of Police, Chittoor.

-o0o-

In reply to the references cited above, it is to inform that the FIR and its connected records were already transferred to SPECIAL INVESTAGATION TEAM on 29-04-2015 so you are hereby requested get information from Special investigation team, Tirupati.

for Supdt. of Police,
Urban Police District
Tirupati

Dr.Vempalli Gandhadhar

It is to submit that on 29.5.2014 at 7 am at Devarakonda forest area of Chinnagottigallu mandal, the red sander smugglers have attacked on the police party having axes for which, on 29.5.2015 at 10.30 am, the then SI has registered a case in Cr.no.57/2014 U/s 353, 341, 307, r/w 34 IPC & 379 IPC. Sec. 20[1] [c] [iii] [iv] [x] of A.P. Forest Act 1967. Sec.3 of Red Sanders wood and Red Sanders Transits Rule 1989, Sec.30 Indian Arms Act was registered and it was investigation.

The information asked by the petitioner is relating to assault on forest officials on 29.5.2015 at Devarakonda forest, Chinnagottigallu mandal of Chittoor distinct. Hence unable to supply of copy of FIR to the petitioner since no offence was took place of assault on forest offices on the particular day.

16/6/15

Sub-Inspector of Police
Bhakarapet PS

అనగనగా ఒక అడవిలో ఇది నిరంతరం జరుగుతున్న సంఘటన.

జరగబోయే ఘటన కూడా!

ఒక చోట నిమ్మ అంట్లు తీసుకెళ్తున్న వాహనంలో ఎర్రచందనం దొరుకుతుంది.

మరో చోట కరేపాకు కోనవద్ద ఒక తమిళకూలీ దేహంలోకి బుల్లెట్ దూసుకెళ్తుంది.

చిమ్మ చీకట్లో నట్ట నడిరాత్రి పెద్దబండ అడవి మధ్యలో హోరాహోరి కాల్పులు జరుగుతాయి.

రాళ్ల వర్షం కురుస్తుంది.

ఇంకో చోట అటవీ అధికారి కాళ్లను గొడ్డలితో నరుకుతారు.

ఈ సంఘటనలకు కాలపరిమితి లేదు!

'ఎర్రచందనం' అనగానే ఒకే దృశ్యం కళ్లముందు సాక్షాత్కరిస్తుంది. ఎదురుగా ఆరు ఎర్రచందనం దుంగల కొయ్యలు, వాటి వెనుక మాసిన గడ్డంతో నలిగిన దేహంతో తలొంచుకొని మోకాళ్లపైన కూర్చొని ఉన్న వ్యక్తి, అతడి వెనక ఆరుమంది యూనిఫాంలో ఉన్న పోలీసులు. ఇదొక ఇతివృత్తం.

కడప, చిత్తూరు జిల్లాల్లోని ప్రజలకు వంట గ్యాస్ అందుబాటులోకి రానంత వరకు ఈ ఎర్రకొయ్యనే వంట చెరకుగా ఉపయోగపడింది. కొండకు తోలుకపోయిన పశువులకు అటు ఒక మోపు, ఇటు ఒక మోపు దుంగల్ని దిగే సేవాళ్లు. మెడలోని గంట శబ్దం చేస్కుంటూ అవి తెల్లారుజామునే పల్లెల్లోకి వచ్చే సేవి. 'కట్టెల మోపులు'గా వాటిని కొనుగోలు చేసి గొడ్డలితో చీల్చి పొయ్యి వెలిగించుకునేవాళ్లు. కొంత మంచి కొయ్య అన్పిస్తే రోకలిబండ చేయించుకునేవాళ్లు. లేకపోతే నులక మంచానికి కాళ్లు. ఇంతకంటే ఉపయోగం వాళ్లకు కన్పించలేదు. ఇలా వంట వండుకోవడానికే కాల్చి పారేసిన కొయ్య 1976 నుంచి తీసుకొని చూసినా కొన్ని వేల టన్నులుంటుందన్నది కఠిన వాస్తవం.

రంగులు చేయడానికి దీని అవసరం ఉందని 1782 వరకు ఎగుమతి అవుతూ వచ్చిన ఎర్రచందనం రైల్వే బోగీల్లో స్లీపర్ క్లాస్ సీట్లుగా అమర్చడానికి వాడేవారు. స్టీమర్ల కింది భాగంలో కలపగానూ ఉపయోగపడింది. వేల టన్నుల ఎర్రచందనాన్ని స్మగ్లర్లు తరాలుగా అమ్మేసుకుంటూపోయారు. చట్టం వచ్చిన తర్వాత నుంచి తరలించుకుపోతున్న దుంగల్ని అప్పుడప్పుడు అక్కడక్కడ పట్టుకుంటూ దాన్నంతా కుప్పగా పోగేసి అమ్మకానికి వేలంగా పెట్టిన దుంగలే పది వేల టన్నులు! దీన్ని బట్టి సరిహద్దులు దాటి తరలిపోయిన కలప ఎన్ని వేల టన్నులు ఉండొచ్చో ఊహించుకోవచ్చు.

1980 ప్రాంతంలో రేణిగుంట – రైల్వే కోడూరు మధ్య ఆగి ఉన్న గూడ్స్ రైళ్లను ఆధారంగా చేసుకొని ఎర్రచందనాన్ని స్మగ్లర్లు విక్రయించుకుంటూ పోయారు. ఈ ప్రాంతాల మధ్య దాడులకు గురైన, ప్రాణాలు పోగొట్టుకున్న రైల్వే డ్రైవర్లు, గార్డులు ఉన్నారంటే ఆశ్చర్యమేస్తుంది. ప్రయాణికుల రూపంలో రైళ్లలో ప్రయాణం చేస్తూ వచ్చే కూలీలు, స్మగ్లర్లు బాలపల్లె, మామండూరు ప్రాంతాల మధ్య చైన్ లాగి రైళ్లు దిగి అడవుల్లోకి వెళ్లిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. రైల్వే పోలీసులు ఎన్నో సంవత్సరాలుగా తమ ప్రయత్నాలు సాగిస్తూ దీన్ని అదుపు చేసుకుంటూ వస్తున్నారు.

ఎర్రటి రుతువు అరణ్యంలోకి ఎప్పుడు ప్రవేశించిందో
నీకు ఎవరు చెప్తారు? నల్లటి మొద్దు కొమ్మలకు
నెత్తుటి పూలు ఎప్పుడు పూశాయో నీకు ఎవరు చెప్తారు?
నీ ప్రశ్నలంటికి ఇప్పుడు అడవి' మొదటి సాక్షి!

* * *

ఒకటి కాదు, రెండు కాదు... ఎర్ర చందనం స్మగ్లింగ్ దారులు ఎన్నో... లారీలు, వ్యాన్లు, సూట్కేసులే కాకుండా యూరియా మూటల్లో, పైపుల మాటున, మొక్కజొన్న బస్తాల కింద, పెట్రోల్ ట్యాంకర్లో, సిమెంటు ట్యాంకర్లో, అరటి పండ్ల పెట్టెల మాటున, నిమ్మ అంట్లు మధ్యన, అంబులెన్స్ వాహనాల్లో, పెళ్లి వాహనాల్లో, బొప్పాయి, చీనీ కాయల మాటున, టెంకాయల మధ్య, పాల వ్యానులో, వరి పొట్టు కింద, కరేపాకు లోడుకింద, మామిడికాయల మాటున, నకిలీ నెంబర్ల కార్లలో, ఇనుప ఖనిజం కింద, ఇసుక ట్రాక్టర్ల కింద... ఎర్ర చందనం దొరకనిది ఎక్కడ? పట్టు బడనిది ఎక్కడ? కడప, చిత్తూరు జిల్లాల్లో పూర్తిగాను, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దుల్లోని అడవుల్లో ఐదులక్షల హెక్టార్లలో ఎర్రచందనం వృక్షాలు ఉన్నాయి. అటవీశాఖ ఎర్రచందనం చెట్లను మూడు కేటగిరిల్లో పరిగణలోకి తీసుకుంటుంది. 10 నుంచి 20 ఏళ్లు, 20 నుంచి 30 ఏళ్లు, 30 నుంచి 40 ఏళ్ల వృక్షాలుగా లెక్కిస్తారు. స్మగ్లర్ల దృష్టి ఎప్పుడూ 30 నుంచి 40 ఏళ్లకు చెందిన వృక్షాలపైనే ఉంటోంది. శాటిలైట్ రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా అటవీ శాఖ అధికారులు పరిశీలించినప్పుడు చిత్తూరు జిల్లాలోని చామల అటవీ రేంజ్ పరిధిలో ఎక్కువ చెట్లు నరికేసినట్లు తెలుస్తోంది. కడప జిల్లాలో 3,14, 590.116 హెక్టార్లలో ఎర్ర చందనం వృక్ష సంపద ఉంది. డివిజన్ల వారీగా చూసినప్పుడు కడప డివిజన్ లో 1,28,644.2, ప్రొద్దుటూరులో 1,01,142.72 హెక్టార్లు, రాజంపేట డివిజన్లో 84,802,976 హెక్టార్లలో ఎర్రచందనం విస్తరించి ఉంది. కడప జిల్లా రైల్వే కోడూరు నుంచి 11 కిలోమీటర్ల దూరంలో శేషాచల కొండల్లో ప్రధాన భాగమైన శ్రీ వెంకటేశ్వర అభయారణ్యం,

కుక్కలదొడ్డి నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుంబుర తీర్థం ద్వారా అడవిలోకి దారులు ఉన్నాయి. రైల్వే కోడూరు రేంజిలో పోట్రాలగుండం, కేసరి బండలు, వాననీళ్ల గుట్ట, చిన్న కలుజులు, పల్లె గుండాలు, కాశికోన, గాదెల, బాటగుండం, చాకలిరేవుకోన, వలస కోన, ముత్తరాన కోన, దొంగ బండల ప్రాంతాలున్నాయి. అలాగే బాలపల్లె రేంజి పరిధిలో యర్రడ్లమడుగు, సిద్దలేరు, కంగుమడుగు, దేశెట్టి గుడాలు, గుంజనేరు, యుద్దరాల తీర్థం, విష్ణుగుండం, సందలేరు, తలకోన ప్రాంతాల్లో నీటి కుంటలు ఉండడం వల్ల ఎర్రచందనం కూలీలకు ఈ ప్రాంతాలు ఆవాసాలుగా మారుతున్నాయి. బాలపల్లె రేంజ్లో ఎక్కువగా ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలు పట్టుబడుతూ వస్తున్నాయి. బాలపల్లె, రైల్వే కోడూరు, చిట్వేలి, రాజంపేట, సానిపాయ రేంజ్లు రాజంపేట డివిజనల్ అటవీ అధికారి (డిఎఫ్ఓ) పరిధిలో ఉన్నాయి. 30 నుంచి 40 ఏళ్లకు పైబడిన ఎర్రచందనం వృక్షాలు బాలపల్లి రేంజ్లో పెద్ద ఎత్తున ఉండడం అక్రమ రవాణాకు కీలకంగా మారింది.

ప్రొద్దుటూరు డివిజన్ అటవీశాఖ పరిధిలో అటవీ భూభాగం 1,64,516. 52 హెక్టార్లలో ఉండగా, అందులో లంకమల అభయారణ్యం 20,050.07 హెక్టార్లు, పెనుశిల నరసింహ అభయారణ్యం 7,844.28 హెక్టార్లు కల్గి ఉంది. ఈ రెండు అభయారణ్యాల్లో కాకుండా 68,440 హెక్టార్లలోనూ ఎర్రచందనం వ క్షాలున్నట్లు సర్వేలు చెప్తున్నాయి. ఇక్కడ 21,17,614 వృక్షాలున్నట్లు లెక్కలు తీశారు. ఎర్ర చందనం చెట్ల పునరుత్పత్తిపై కేంద్ర అధ్యయన సంస్థ చేపట్టిన సర్వే ప్రపంచంలోనే అత్యంత అరుదైన అంతరించిపోతున్న వృక్షంగా ఎర్రచందన వృక్షాన్ని గుర్తించింది.

కోడూరు రైల్వే స్టేషన్లో ప్రతిరోజూ తమిళనాడు నుంచి వస్తున్న 'తమిళకూలీ'ల సంఖ్య వందల్లోనే ఉంటూ వస్తోంది. ఏకంగా ఆహార పదార్థాలను, వంట పాత్రలను మోసుకొని తెల్లవారుజామున చెన్నై నుంచి వచ్చే రైలులోంచి దిగేసి అడవుల్లోకి వెళ్లిపోవడాన్ని స్థానికులు నిత్యం చూసే దృశ్యంగా చెప్పుకోవచ్చు. ఎర్రచందనం కూలీలతో కడప కేంద్ర కారాగారం నిండిపోయింది. 350 మంది వరకు ఎర్రచందం రిమాండు ఖైదీలు ఉన్నారు. అందులోనూ 90 శాతం మంది తమిళులే కావడం విశేషం.

గత సంవత్సరం జూలై 1వ తేదీ నాడు తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని మైదానంలో 'ఎర్రచందనం కూలీ'లను 356 మందిని నిందితులుగా 'బహిరంగ కోర్టు నిర్వహించాల్సి వచ్చింది. కేసు విచారణ నేపథ్యంలో న్యాయస్థానాల ప్రాంగణం సరిపోనందువల్ల వారినందరిని మైదానంలో తీసుకరావల్సి వచ్చింది. 2013 డిసెంబరు 15న శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లర్లు ఇద్దరు అటవీ శాఖ అధికారులను (డేవిడ్, శ్రీధర్) హింసాత్మకంగా హత్య చేసిన సంఘటన సంచలనం సృష్టించింది. కూలీలు, విద్యార్థులు, యువకులు, నిరక్షరాస్యులు, మైనర్లు కూడా ఈ జాబితాలో ఉన్నారు. 'తమిళ కూలీ'లతోనే రాయలసీమలోని జైళ్లు నిండిపోతూ వచ్చాయి. జిల్లాల్లోని ఉప కారాగారాల్లోనూ గదులు వీరికే సరిపోతున్నాయి.

కడప, ప్రొద్దుటూరు, రాజంపేట అటవీ డివిజన్ల పరిధిలో 14 రేంజ్లున్నాయి. ఒక్కో బీటు 25 నుంచి 75 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉంటోంది. సాధారణంగా ప్రక్క రాష్ట్రాల్లో ఒక్కో బీటు పరిధి 5 నుంచి 10 చదరపు కిలోమీటర్లలోపే ఉంటుంది. ఒక అంచనా ప్రకారం శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విస్తీర్ణం అధికంగా ఉన్న ఎనిమిది అటవీ డివిజన్ల పరిధిలో అటవీశాఖ సిబ్బంది వివిధ దాడుల్లో పట్టుకున్నది 50 వేల దుంగలు మాత్రమే. అక్రమ రవాణా ద్వారా 50 శాతం దుంగలు సరిహద్దులు దాటి పోయాయి. లభిస్తున్న ఎర్రచందనం దుంగల్లో అవి ఏ రేంజ్లో, ఏ సెక్షనులో, ఏ బీటులో నరికివేశారో గుర్తించలేని పరిస్థితి స్పష్టంగా కన్పిస్తోంది.

ఎర్రచందనం స్మగ్లర్లు అక్రమ రవాణా చేసే ఎర్రచందనం దుంగలు దేశంలో ఎక్కడ దొరికినా వాటిని విక్రయించుకునే సదుపాయం, అవకాశం ఆంధ్రప్రదేశ్కే దక్కేలా ఒక హామీని కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ ద్వారా ఎట్టకేలకు ఒక హామిని మాత్రం ఇప్పటికి మన అధికారులు పొందగలిగారు. అది కొంత ఆనందం. రాయలసీమ జిల్లాల్లోని నేలల్లో కాల్షియం కార్బొనేట్ ఎక్కువగా ఉండడం వల్లనే మొదటి శ్రేణికి చెందిన ఎర్రచందనం ఇక్కడి వృక్షాల్లో లభ్యమౌతోందని శాస్త్రవేత్తల అభిప్రాయం.

శేషాచలంలో ఎన్‌కౌంటర్ జరిగిన పన్నెండు రోజుల తర్వాత కడప సబ్ డివిజన్ పరిధిలో ఎర్రచందనం కూలీలకు గొడ్డళ్లు తయారుచేసి ఇస్తున్న ముఠా పట్టుబడింది. నలబై పదునైన గొడ్డళ్లు, ఎనిమిది ఎర్రచందనం దుంగలు, వంట సామాగ్రిని వారినుంచి స్వాధీనం చేసుకొన్నారు. అదే రోజు ప్రొద్దుటూరులో కూడా మరో ముఠా నుంచి యాబై గొడ్డళ్లను పట్టుకోగలిగారు. గతంలో ఫారెస్టు అధికారులకి చిక్కి బెయిలుపై బయటికొచ్చిన వాళ్లే వీళ్లని విచారణలో వెల్లడైంది. శేషాచలం ఎన్‌కౌంటర్ జరిగిన కొద్ది రోజులకే రైల్వే కోడూరులోని వాగేటికోన రిజర్వాయర్ సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న ఎర్రచందనం బయటపడింది. పది ఎర్రచందనం దుంగలు, ఐదుమంది కూలీలు పట్టుబడ్డారు. ఈ సంఘటనలు ఏం చెప్తున్నాయి? శేషాచలం ఎన్‌కౌంటర్‌లు చూసి కూడా స్మగ్లర్లు, కూలీలు వెనకడుగు వేయడం లేదని స్పష్టమౌతోంది.

ఎర్రచందనం చెట్లను నరికి డ్రస్సింగ్ అయిన దుంగలను ఢిల్లీ, కోల్కతా, ముంబై, బెంగుళూరు, చెన్నై వంటి నగరాలకు తరలిస్తున్నారు. అక్కడ చిన్న చిన్న ముక్కలుగా చేసి సుమారు ముప్పై కిలోల చొప్పున విద్యార్థుల బ్యాగుల్లో సర్ది వారికి విమాన టిక్కెట్లు ఇచ్చి విదేశాలకు ఎగుమతి చేయడం ఒక పద్ధతిగా వెలుగులోకి వచ్చింది. ఇదే కోణంలో నుంచే హైద్రాబాదు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఎర్రచందనం కొయ్యలను పొడి రూపంలోకి మార్చి దుబాయ్ మీదుగా చైనాకు తరలిస్తున్న వైనం బయటపడింది. గత రెండు, మూడు నెలల వ్యవధిలోనే సుమారు వంద కిలోల 'ఎర్రచందనం పౌడర్'ను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఎర్రచందనం అక్రమరవాణాలో తమిళనాడు కీలక కేంద్రంగా ఉంటోంది. రోడ్డు మార్గాన చెన్నైకి చేర్చుకొని ఆపై సముద్ర మార్గాన చైనాకు యథేచ్ఛగా తరలిస్తున్న 'బడా స్మగ్లర్లు' కోట్లకు పడగలెత్తారు. వేరుసెనగ పప్పు, ఉప్పు, వంట సామాగ్రి పేరుతో ఎర్రచందనం దుంగలు నింపి సింగపూరుకు తరలించేందుకు సిద్ధమైన కంటైనర్లు గతంలో చెన్నై పోర్టు అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. ఇందులో సుమారు పద్దెనిమిది టన్నుల ఎర్రచందనం దుంగలు

బయటపడ్డాయి. ఇదే అనుమానంతో సింగపూరుకు బయలుదేరిన మరొక కంటైనర్లు వెనక్కి రప్పించగా అందులో ఇరవై అడుగుల పరిమాణమున్న కంటైనర్లో సుమారు పద్దెనిమిది టన్నుల ఎర్ర చందనాన్ని పట్టుకోగలిగారు. ఎగుమతులకు సంబంధించి తప్పుడు నకిలీ లేబుల్స్, సర్టిఫికెట్లు సృష్టించి ఎర్ర చందనాన్ని ఎగుమతి చేస్తున్న విధానం కన్పిస్తోంది.

కడప, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లోని సరిహద్దు గ్రామాల్లోంచి తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు ఎర్రచందనం చేర్చుకొంటున్నారు. ఓడరేవులకు చేరిన తర్వాత అక్కడి కంటైనర్లలో సరకుల కింది భాగంలో దుంగలను చేర్చి తరలిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చూసీచూడనట్లు వదిలేయడానికి వీలుగా కస్టమ్స్ అధికారులకు 'ఖరీదైన బహుమతులు' ఇచ్చి స్మగ్లర్లు ప్రలోభపెడుతున్నారు. ముందుగా రోడ్డు మార్గాల ద్వారా పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపూర్, మిజోరం, అస్సాం, అరుణాచల ప్రదేశ్, సిక్కిం వంటి ప్రధానంగా ఈశాన్య రాష్ట్రాలకు చేర్చుకొని అక్కడినుంచి బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్, భూటాన్, చైనాలకు వ్యూహాత్మకంగా తరలించేస్తున్నారు.

ఏ ప్రాంతంలోని ఆ ప్రాంతానికి సంబంధించిన నిరుద్యోగ యువతను, కూలీలను కొరియర్ వ్యవస్థగా నిర్మితం చేసుకొని అత్యంత రహస్యంగా సరిహద్దులు దాటిస్తున్నారు. మయన్మార్ (బర్మా)కు ఎర్ర చందనం తరలించగలిగితే ప్రపంచంలోని ఏ దేశానికైనా, అక్కడినుంచి స్మగ్లింగ్ చేయగలిగిన సత్తా తమకుందని 'మయన్మార్ నెట్వర్క్ నిరూపిస్తోంది. బర్మా నుంచి శరణార్థులుగా భారత్ కు వచ్చిన వారు ఈ నెట్వర్క్లో ప్రధాన భూమిక పోషిస్తుంటారు. మరో దారిలో ఎర్రచందనం దుంగలు గుజరాత్ లోని కాండ్లా నౌకాశ్రయానికి చేరుకుంటున్నాయి. అక్కడినుంచి నౌకల్లో దుబాయ్! తరలి పోతున్నాయి. ఇంకోదారిలో పశ్చిమ బెంగాల్ నుంచి అగర్తలా చేర్చుకొని అక్కడి నుంచి చైనా, జపాన్లకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించగలిగారు. చెన్నై - కోల్కతా జాతీయ రహదారిద్వారా శ్రీకాకుళం మీదుగా ఒరిస్సా, పశ్చిమ బెంగాల్కు దుంగలను 'అగర్తల' వరకు చేర్చుతున్నారు.

తమిళనాడు రాష్ట్రానికి చెందిన వేలూరు, తిరువన్నామలై, చెంగల్పట్టు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తమిళ కూలీలు 'ఎర్రచందనం' కొయ్యలను కొట్టడానికి ఆంధ్రా అడవుల్లోకి వస్తున్నారు. చిత్తూరు జిల్లాకు యాభై కిలోమీటర్ల దూరం లోంచే సరిహద్దు మొదలవుతోంది. తమిళనాడు బస్సులద్వారా, చెన్నై ఎక్స్‌ప్రెస్ ద్వారా వందల సంఖ్యల్లో అడవుల్లోకి చేరుకుంటున్నారు. జవాది కొండల్లోని కావలూర్, పల్లంబట్టు, కోమటేరు, వీరప్పనూర్, కోయలూర్, దానమత్తూర్, జమునా మరత్తూర్, ప్రాంతాల్లోని కూలీలను ఎంపిక చేసుకొని వృక్షాలను కొట్టడానికి ఏజంట్లు మాట్లాడుకొని పిల్సుకొస్తున్నారు. కూలీలను ఐదుమంది, పదిమంది నుంచి సంఖ్య పెంచుకుంటూ బృందాలుగా తయారుచేసుకొని ఏఏ ప్రాంతాల్లో, ఎవరెవరు వెళ్లాలో, అక్కడికి ఎలా చేరుకోవాలో వంటి అన్ని అంశాల్ని ఏజంట్లే కూలీలతో మాట్లాడు కుంటారు. ఒప్పందం కుదిరిన వెంటనే ఏజెంట్లు ఆహారం, నీళ్లు వంటి ఏర్పాట్లు చేస్తారు. లేదంటే వాటికి కూడా ఏజంట్లో డబ్బు చెల్లిస్తే కూలీలే తమతో పాటే మోసుకెళ్తారు. ఒక కూలి సుమారు నెలనుంచి రెండు నెలల వరకూ అడవిలోనే ఉండవలసి ఉంటుంది. దుంగలు నరకడం, వాటిని మోసుకొని ఒక చోటికి చేర్చడం, అక్కడ్నుంచి వాహనాల్లోకి ఎక్కించడం వంటి పనులన్నీ కూలీలే చేయాల్సి ఉంటుంది. స్మగ్లర్లు ప్రత్యక్షంగా కూలీలకు కన్పించకుండా ఏజంట్ల ద్వారా తమ పనులు పూర్తిచేయిస్తారు. పది రోజుల పనికి ఒక్కొక్క కూలీకి 30వేల వరకు ఇవ్వాల్సి ఉంటుంది.

అడవుల్లో ఇరవై నుంచి ముప్పై కిలోమీటర్ల వరకు దుంగల్ని భుజాలపై మోసుకొని రావడంలో తమిళనాడులోని తిరువణ్ణామలై, సేలం, విల్లుపురం జిల్లాలకు చెందిన మలయాళీ గిరిజనులు సిద్ధహస్తులుగా పేరుపొందారు. ఒక్కో చెట్టును నరకడానికి ఐదుమందితో కూడిన బృందాలను ఏర్పాటుచేసి మేస్త్రీలు వీరితో పని చేయిస్తారు. అడవుల్లో ఎర్రచందనం దుంగలు కొట్టే పనికి ఆరునెలలకు లక్ష రూపాయల అడ్వాన్సు ఇస్తున్నారు. దీంతో పనుల్లేక ఉన్నవాళ్లందరూ కూలీల అవతారమెత్తుతున్నారు. తమిళనాడు నుంచి ఐదువేల మందికి పైగా కూలీలు ఎర్రచందనం పనికోసం అడవుల్లో ఉన్నట్లు అంచనా. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జైళ్లలో ఇప్పటికే రెండువేల మందికి పైగా తమిళ కూలీలు శిక్ష అనుభవిస్తున్నారు.

తిరుపతి వద్ద జరిగిన ఎన్ కౌంటర్లో చనిపోయిన ఇరవై మంది ఎర్ర కూలీల్లో ఎక్కువ మంది జవ్వాదిమలై ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం. గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ కూడా జవ్వాదిమలై ప్రాంతానికి చెందినవాడే. వీరప్పన్ హతమయ్యాక అతడి అనుచరులు రాయలసీమ ప్రాంతంలోని ఎర్రచందనం పై దృష్టిపెట్టారు. ఫలితంగా గత పదేళ్ల కాలంలో సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల ఎర్రచందనంను కోల్పోయాం. దోపిడీకి గురై సరిహద్దులు దాటిపోయిన ఎర్రచందనం విలువ అక్షరాల నలభై వేల కోట్లు!

వళిమూడి విట్టార్ (దారి మూసి వేశారు)
ఉనక్కాగ యారో వందార్ (నీ కోసం ఎవరో వచ్చారు).
రొంబ ఇరుట్టా ఇరుక్కు (చాలా చీకటిగా ఉంది)
వీట్టుక్కు ఎప్పడి పోవీంగ (ఇంటికి ఎలా వెళతారు)'

ఉన్నపళంగా చంటి బిడ్డను చంకనేసుకొని పొద్దుటే మొదటి బస్సుకు చంద్రగిరికి వచ్చేసింది మునీయమ్మాళ్, మాసిపోయిన పాత చీర కొంగుతో పదే పదే కన్నీళ్లు తుడ్చుకుంటూ ఏడుస్తోంది. 'నువ్వు ఎందుకేడుస్తున్నావ్?' అని ఆమెను ఎవరూ అడగలేదు. ఆమె చెప్పలేదు. ఆమె దుఃఖం ఆమెకే తెలుసు. చంద్రగిరి ఠాణా ఎక్కడుందో కనుక్కోవడానికి ఆమెకు తెలుగు రాదు.

శేషాచలం అడవిలో జరిగిన ఎన్కౌంటర్లో మృతిచెందిన ఇరవైమంది తమిళ కూలీల్లో శశికుమార్ కూడా ఒకడు. అతడి భార్యే మునీయమ్మాళ్. ఆ రోజు ఆమెకు చంద్రగిరి ఠాణాలో న్యాయం జరిగిందో, లేదో? ఆమె మాటల్ని పట్టించుకున్నారో లేదో తెలియదు. కానీ రాష్ట్ర హైకోర్ట్ సుమోటోగా ప్రజాహిత వాజ్యంలో పిటిషనర్గా చేర్చింది. ఆమె కోరితే హైకోర్టు న్యాయ సేవా సంఘం తగిన ఏర్పాట్లు చేయాలని కూడా ఆదేశించింది. తిరువణ్ణామలై, ధర్మపురి జిల్లాల్లో తమిళ కూలీల శవాలతో శోక సంద్రంలో నిండిపోయాయి గ్రామాలు. కన్నమంగళం గ్రామం

కోల్పోయిన తన కన్నబిడ్డల శవాలను చూస్కొని కన్నీటి సంద్రమైంది. శవాలను రహదారిపై ఉంచి రాస్తారోకోలు చేశారు. వేట్టగిరి పాళ్యం గ్రామంలో సినీ దర్శకుడు గౌతమన్ ఆధ్వర్యంలో మృత దేహాలతో పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు.

పోలూరుకు చెందిన మృతుడు శశికుమార్ భార్య మునీయమ్మాళ్ తన భర్త శవానికి మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె కోరిక మేరకు మృత దేహానికి రీ పోస్టుమార్టం నిర్వహించే బాధ్యతలను నిమ్స్ డైరక్టర్‌కు అప్పగించారు. ఇదే కోవలోనే తిరువణ్ణామలై ఆసుపత్రిలోని శవాగారంలో ఉన్న మిగిలిన ఐదు మృతదేహాలు మురుగన్, మూర్తి, మహేంద్రన్, పెరుమాళ్, మునుసామిలకు చెందిన బంధువులు అత్యవసరంగా కోర్టును ఆశ్రయించి 'రీపోస్టు మార్టం' కోరారు. ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్‌కు వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి మళ్లీ శవ పరీక్ష నిర్వహించాల్సిందిగా కోర్టు ఆదేశించింది.

శేషాచలంలో మరణించిన తమిళ కూలీల కుటుంబాలను, బాధితులను కలుసుకొని మాట్లాడిన తర్వాత ముంబయి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సురేష్ తన దృష్టికి వచ్చిన వాస్తవాలను వెల్లడిస్తూ మృతదేహాలను పరిశీలించినపుడు కొందరకి దవడపళ్లు లేవు. మరికొందరికి చేతి, కాలివేళ్లు నరికి ఉన్నట్లు తెలుస్తోందని అభిప్రాయపడ్డారు.

తమతో పాటూ వచ్చిన పదకొండు మందిని ఆంధ్రా పోలీసులు బలవంతంగా తీసుకెళ్లినట్లు ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న బాలచందర్, ఇళంగో, శేఖర్ ఇచ్చిన సాక్ష్యాలను కూడా వీరే సేకరించగలిగారు. తిరువణ్ణామలై జిల్లా కన్న మంగళం పుదూర్ కు చెందిన శేఖర్ ఇచ్చిన సాక్ష్యం కీలకంగా మారింది. తిరుపతిలో చెట్లు కొట్టే పనికోసం మా గ్రామాల నుంచి నాతో పాటూగా ఏడు మందిని బయలుదేరి తిరుత్తణి మీదుగా తిరుపతికి వస్తున్నప్పుడు నగరికి దగ్గర్లో బస్సును ఆంధ్రా పోలీసులు నిలిపి నా ముందు కూర్చున్న ఏడు మందిని దింపి తమతో పాటూ తీసుకెళ్లారు. నేను తప్పించుకొని తర్వాతి 'ఊర్లో బస్సు దిగేసి మా ఊరికి వెనక్కి వెళ్లిపోయాను. సోమవారం రోజు నేను ఊరికెళ్లి పోయాను మంగ్లవారం రోజుకంతా వాళ్లందరూ చనిపోయినట్లు తెలిసిందని' శేఖర్ జాతీయ మీడియా దృష్టికి తీసుకెళ్లాడు.

శేషాచలం ఎన్ కౌంటర్ తర్వాత మృతుల ఫోటోలను తీసుకొని వారిని గుర్తించే పనిలో భాగంగా తమిళనాడులోని తిరువణ్ణామలైకి వెళ్లినప్పుడు చనిపోయిన వారి పేర్లు, వాళ్ల గ్రామాలు వంటి వివరాల్ని శేఖరే ఆంధ్రా పోలీసులకు చెప్పాల్సి వచ్చింది. వేలూరు జిల్లాకు చెందిన మహేంద్రన్, మురళీ భారతి, దాసన్ వంటివారు మీడియా ముందుకొచ్చి వాస్తవాలను బయటపెట్టారు. 'మనోహరన్ అనే ఏజెంటు అడవుల్లో చెట్లు కొట్టడానికి తీసుకపోతున్నప్పుడు గుడిపాల గ్రామం దగ్గర మమ్మలందర్నీ పట్టుకపోయారు పోలీసులు. తప్పించుకున్న వాళ్లం బతికి పోయామని' గోడు వెల్లబోసుకుంటున్నారు.

తిరువణ్ణామలై జిల్లా మురుగంబాడి గ్రామానికి చెందిన మృతుడు మునుస్వామి తల్లి పద్మ, వేటగిరి పాలెంకు చెందిన మృతుడు పళణి సోదరి లక్ష్మి వాళ్లందరూ ఇదే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కీలకమైన ఎనిమిదో వ్యక్తిగా మిగిలిన శేఖర్, బాలచంద్రన్లు తమకు, తమ కుటుంబాలకు రక్షణ కావాలని ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల సంఘంను ఆశ్రయించారు. తమిళం తప్ప మరో భాష రాని వారిని సుప్రీం న్యాయవాది వృందాగ్రోవర్, పీపుల్స్ వాచ్ ప్రతినిధి హెన్రీ తీఫంగేలు – ఛైర్మన్ జస్టిస్ కేజీ బాలకృష్ణన్ సమక్షానికి తీసుకెళ్లారు. సాక్షులకు తగిన రక్షణ కల్పించవలసిందిగా తమిళనాడు ప్రభుత్వాన్ని ఎన్‌హెచ్‌ఆర్సీ ఆదేశించింది. కేసును కూడా సుమోటోగా స్వీకరించింది.

ఎన్ కౌంటర్ జరిగిన చంద్రగిరి మండలం సచ్చినోడు బండ, చీగటీగల కోన ప్రాంతాల్లో పర్యటించిన జాతీయ ఎస్టీ కమీషన్ ఛైర్మన్ కూడా పలు అనుమానాలు కల్గుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. మృతుల్లో పదమూడు మంది గిరిజనులే కావడం విశేషం. దుంగలు పాతవిగా ఉన్నాయని, వాటిపై పెయింటింగ్ వేసినట్లు ప్రచురించిన హిందీ పత్రికను కూడా వారు ఈ పర్యటన సందర్భంగా చూపించారు. ఛైర్మన్ రాకకు మూడు రోజుల ముందు తమిళనాడుకు చెందిన మానవ హక్కుల సంస్థ 'పీపుల్స్ వాచ్' తిరుపతి శ్రీవారిమెట్టు ప్రాంతం వరకు చేరుకో గలిగింది. ఎన్కౌంటర్ జరిగిన ప్రదేశం నిషేధిత ప్రాంతమని స్థానిక అటవీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వారిని వెనక్కి పంపివేశారు.

శేషాచలం అడవుల్లో మరణించిన ఇరవైమంది కూలీలు అత్యంత సమీపం లోంచే కాల్చి చంపబడ్డారని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి సి. చంద్రశేఖర్ ఎన్కౌంటర్ జరిగిన వెంటనే హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఎన్కౌంటర్లో పాల్గొన వారిపై ఐపీసీ 302 కింద కేసులు నమోదు చేయాలని పిటిషనర్ కోరారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కళ్యాణ్ జ్యోతిసేన్ గుప్త, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచాలని ఆంధ్రా డీజీపీని ఆదేశించింది. ఆ తర్వాత నాలుగు రోజులకు పౌర హక్కుల సంఘం సభ్యులు శేషాచలంలోని ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎక్కడో పట్టుబడిన కూలీలను ఇక్కడికి తెచ్చి కాల్చివేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. నిషేధిత రిజర్వు ఫారెస్టోకి అటవీశాఖ అనుమతి లేకుండా ప్రవేశించిన కారణంగా ఏడుగురు సభ్యులపై అటవీశాఖ చట్టం - 1967 (20వ సెక్షన్) ప్రకారం కేసు నమోదు చేశారు.

మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కళగం (ఎండీఎంకే) నేత వైగో చిత్తూరు జిల్లా కలెక్టరేట్ ముట్టడికి ర్యాలీగా బయలుదేరి వస్తుండగా వేలూరులో పోలీసులు అరెస్ట్ చేశారు. డిప్యూటీ స్పీకర్ తంబిదురై సీబీఐ' దర్యాప్తును కోరుతూ తన గళం విన్పించారు. సీపీఐ ఎంపీ డి. రాజా రాజ్యసభలో చర్చ లేవనెత్తిన సందర్భంలో 'ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీబీఐ ప్రతిపాదన రాలేదు. కాబట్టి కేసు సీబీఐకి బదిలీ చేయడం సాధ్యం కాదని' కేంద్ర హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ సమాధాన మిచ్చుకున్నారు. 'ఎన్కౌంటర్ పేరిట 20 మంది కూలీలను కాల్చి చంపడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం' అని వైగో ఇప్పటికీ అన్ని ప్రసంగాల్లోనూ చెప్తున్నారు.

శేషాచలం ఎదురు కాల్పుల ఘటనలో మృతులు ఉపయోగించిన ఆయుధాలను, ఎస్టీఎఫ్ అధికారులు ఉపయోగించిన ఆయుధాలు విచారణ ముగిసే వరకు జప్తు చేసి భద్రపర్చాలని ఎన్ హెచ్ఆర్సీ ఆదేశించింది. వీటితో పాటే పోలీసు రిజిష్టరు, లాగ్ బుక్స్, జీడీ ఎంట్రీ, ఇతర పత్రాలు నాశనం కాకుండా, టాంపరింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించింది.

ఢిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఎల్‌సీ గోయెల్ 'శేషాచలం ఎన్‌కౌంటర్‌పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని నివేదికను కోరారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ జైన్ మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా రెవిన్యూ అధికారి విజయ చందర్‌ను నియమించారు.

ఏప్రిల్ 6, 2015 నాడు సాయంత్రం ఏడు గంటలకు శేషాచలం అడవుల్లోకి వందల సంఖ్యలో ఎర్రచందనం కొట్టడానికి కూలీలు ప్రవేశిస్తున్న సమాచారం టాస్క్‌ఫోర్స్‌కు అందింది. టాస్క్‌ఫోర్స్ డీఐజీ ఆదేశాల మేరకు 24 మందితో కూడిన సిబ్బంది బృందం ఆయుధాలతో శ్రీవారిమెట్టు నుంచి కూంబింగ్ ప్రారంభించింది.

చీకటిగలకోన వద్ద జరిగిన కూంబింగకు డీఎస్పీ హరినాథబాబు నేతృత్వం వహించారు. ఏప్రిల్ 7వ తేదీ ఉదయం 5:30 గంటల సమయంలో ఎర్రకూలీలు పోలీసులపై రాళ్లదాడి చేశారు. గొడ్డళ్లు విసిరారు. పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. కానీ కూలీలు ఎదురుదాడి చేశారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరిపారు. అక్కడ తొమ్మిది మంది కూలీలు మృతిచెందారు.

సచ్చినోడిబండ వద్ద జరిగిన కూంబింగ్‌కు డీఎస్పీ కె. మహేంద్రరాజు నేతృత్వం వహించారు. ఏప్రిల్ 7వతేదీ ఉదయం 5:30 గంటలకు ఎర్రకూలీలు పోలీసులపై రాళ్లదాడి చేశారు. పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. లొంగిపోక పోవడం వల్ల కాల్పులు జరపాల్సి వచ్చింది.

చెన్నై మైలాపూర్ లోని హెరిటేజ్ సూపర్ మార్కెట్ పై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. కాల్పుల ఘటనపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా విభాగం క్యాంపెయినర్ వీపీ అబ్రార్ 'దర్యాప్తును కోరారు. ఎండీఎంకే నేత వైగో ధర్నా చేశాడు. ఘటనపై సీబీఐ దర్యాప్తును కోరుతూ సీపీఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణన్ తన ఖండన తెలిపారు. ఏప్రిల్ 14న ఢిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోయల్ ను కలిసి పూర్తి నివేదికను ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు అందజేశారు.

తమిళనాడు ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేస్తూ రాసిన లేఖకు ప్రత్యుత్తర మిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా విచారణ చేస్తామని చంద్రబాబు వివరణ పంపారు. శేషాచలం ఎన్కౌంటర్ పై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని పౌరహక్కుల సంఘం దాఖలు చేసిన వాజ్యంపై ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కల్యాణ్ జ్యోతిసేన్ గుప్తా, జస్టిస్ పి.వి. సంజయ్ కుమార్లతో కూడిన ధర్మాసనానికి గత ఆదేశాల మేరకు ఏపీ డీజీపీ జేవీ రాముడు సీల్డ్ కవర్లో ఇచ్చిన నివేదికను ఏపీ అదనపు అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ఏప్రిల్ 10వ తేదీ కోర్టుకు సమర్పించారు.

ఎన్కౌంటర్లో చనిపోయిన మృతుల కుటుంబీకులు ఏప్రిల్ 12వ తేదీ చిత్తూరు జిల్లా చంద్రగిరి పోలీస్ స్టేషన్లో చట్టపరమైన చర్యలు కోరుతూ ఫిర్యాదులు చేశారు. కేసులు నమోదయ్యాయి. ఈ అంశానికి సంబంధించి విచారణ అధికారిగా అర్బన్ జిల్లా అదనపు ఎస్పీ త్రిమూర్తులు నియమితులయ్యారు.
11 మంది కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు.

ఉదయం పది గంటలకు టాస్క్‌ఫోర్స్ డీఐజీ కాంతారావు, అనంతపురం రేంజ్ డీఐజీ బాలకృష్ణ చిత్తూరు ఎస్పీ శ్రీనివాస్, తిరుపతి డీఎస్పీ శ్రీనివాస్

ఘటనా స్థలానికి చేరుకున్నారు. మధ్యాహ్నం పన్నెండు గంటలకు విచారణాధికారి విజయచందర్ సంఘటనా స్థలంకు చేరుకొని మృతదేహాలకు పంచనామా నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు రేంజ్ ఐజీ గోపాలకృష్ణ, డీఐజీ బాలకృష్ణ అర్బన్ ఎస్పీ గోపీనాథ్ జెట్టి హెలికాప్టర్లో ఎన్కౌంటర్ జరిగిన ప్రదేశాన్ని ఏరియల్ సర్వే చేశారు. సాయంత్రం ఐదు గంటలకు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కాలేజీకి చేర్చారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో డీజీపీ రాముడు భేటీ అయ్యారు. అనంతరం గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ కు, కేంద్ర హోంమత్రి రాజ్ నాథ్ సింగ్ కు ఫోన్ చేసి 'టాస్క్ఫోర్స్ బలగాలు ఆత్మరక్షణకోసం కాల్పులు జరిపారని' చెప్పినట్లు సమాచారం. తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో ఉన్న రాష్ట్ర హోంమంత్రి, ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు. చెన్నై కోయంబేడు బస్టాండులో ఆగి ఉన్న ఆంధ్రా బస్సుల అద్దాలు పగిలాయి. తమిళ పార్టీలు ఆందోళనకు దిగాయి. ఆంధ్రా బస్సుల రాక-పోకలు ఆగిపోయాయి. ఆంధ్రా క్లబ్ పై దాడి జరిగింది. ఎన్కౌంటర్ని తమిళనాడు ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం, నాయకురాలు జయలలిత ఖండించారు. 'వచ్చిన వాళ్లు కూలీలు కాదు, స్మగ్లర్లే. అయినా వాళ్లు ఏమైనా గడ్డికోసుకునేందుకు అడవికి వచ్చారా?' అని రాష్ట్ర అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు.

కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు మానవ హక్కుల సంఘాల వారిని తప్పుబట్టారు. స్మగ్లర్లు పోలీసులను చంపినప్పుడు మీరెందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వారం రోజుల పాటూ బస్సులు రెండు రాష్ట్రాలకు మధ్య ఆగిపోయాయి. శేషాచలం ఎన్కౌంటర్ పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది.

శేషాచలం ఎన్ కౌంటర్ కు సంబంధించిన మృతుల పంచనామా (ఇంక్వెస్ట్), శవపరీక్షల (పోస్టుమార్టం) నివేదికల్ని ఇవ్వాల్సిందిగా ఏప్రిల్ 15 నాడు రాష్ట్ర హైకోర్టు కోరింది.

అడవుల్లో ఉన్న తమిళకూలీలు బయటికి వచ్చేస్తున్నారనే సమాచారంతో కడప జిల్లా రాయచోటి రాజంపేట మార్గంలోని సానిపాయ రేంజి, కడప-రామాపురం లోని గువ్వల చెరువు రేంజి, కోడూరు, తిరుపతి ప్రాంతాల్లో నిఘా పెంచి కూంబింగ్ పెద్ద ఎత్తున జరిపారు. శేషాచలం అడవుల్లో 12 కెమెరాలు అమర్చారు. వీటిని తిరుపతి, హైద్రాబాదుల్లోని అటవీ కేంద్రాలకు అనుసంధానించారు. జీపీఎస్ పరిజ్ఞానంతో దీన్ని జత చేశారు. కూలీల సెల్ ఫోన్ల ఆధారంగా స్మగ్లర్ల నెట్‌వర్క్‌ను ఛేదించాలని వ్యూహం చేశారు.

శేషాచలం ఎన్కౌంటర్ పై కేంద్ర హోంమంత్రి రాజ్ నాథ్ సింగ్ స్పందిస్తూ – 'రాష్ట్ర ప్రభుత్వం నుంచి విజ్ఞప్తి రానందున సీబీఐ దర్యాప్తు సాధ్యం కాదని తేల్చి చెప్పేశారు.

శేషాచలం ఎన్కౌంటర్ పై దర్యాప్తు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేస్తామని హైకోర్టుకు తెలిపింది. ఇందులో డిఐజి, ఎస్పీ, ఏఎస్పీ స్థాయి అధికారులు ఒక్కొక్కరు కాగా డీఎస్పీ, ఇన్ స్పెక్టర్ స్థాయి అధికారులు ఇద్దరిని ఇందులో నియమించారు. ఏపీ క్యాడర్ ఐజీ స్థాయి అధికారి రవిశంకర్ అయ్యన్నార్ సిట్ అధినేతగా – కర్నూలు రేంజి డీఐజీ బి.వి. రమణకుమార్, సాంకేతిక సేవల విభాగం ఎస్పీ జి. పాలరాజు, పశ్చిమ గోదావరి జిల్లా ఏఎస్పీ ఎల్, చంద్రశేఖర్, సీఐడీ డీఎస్పీ ఎన్. యుగంధర్ బాబు, సీఐడీ డీఎస్పీ కె. రఘు, తూర్పు గోదావరి జిల్లా ఇన్ స్పెక్టర్ జి. మధుసూదన్, చిత్తూరు జిల్లా ఇన్ స్పెక్టర్ ఎస్. చంద్రశేఖర్ మొత్తం ఎనిమిది మంది సభ్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసింది.

శేషాచలం ఎన్ కౌంటర్లో మరణించిన తమిళకూలీలు

తమిళనాడు పోలీసులు అధికారికంగా నమోదు చేసిన వివరాల ప్రకారం తిరువణ్ణామలై జిల్లాకు చెందిన వారు.

1. మునుస్వామి (35)
2. శశికుమార్ (35)
3. పన్నీరు సెల్వం (22)
4. వెల్లిముత్తు (22)
5. చిన్నస్వామి (47)
6. మేలకుప్పనూరుకు చెందిన గోవిందస్వామి (37)
7. మేలకుప్పనూరు, నమియాంమ్పట్టు (పోలూరు తాలూకా)కు చెందిన కన్నన్ అలియాస్ రాజేంద్రన్ (30)
8. కలంబురాన్ కోట్టై, వేట్టగిరిపాళెం (పోలూరు తాలూకా) కు చెందిన మురుగన్ (45)
9. నోలంబై, వేట్టగిరిపాళెం (పోలూరు తాలూకా)కు చెందిన పెరుమాళ్ (37)
10. మందైవేలి, కన్నమంగళం, కాళసముద్రంకు చెందిన పళని (35)
11. కళ్ళైమేడు, గాంధీనగర్ (పోలూరు తాలూకా)కు చెందిన మహేంద్రన్ (25)
12. కళ్ళైమేడు, మురగపాడి గ్రామానికి చెందిన మూర్తి (38)
13. హరికృష్ణన్ (ధర్మపురి జిల్లా – అరసనత్తం)
14. లక్ష్మణన్ (ధర్మపురి జిల్లా – అరసనత్తం)
15. శివకుమార్ (ధర్మపురి జిల్లా – అరసనత్తం)
16. శివలింగం (ధర్మపురి జిల్లా – కరక్కంపట్టి)
17. వేలాయుధం (ధర్మపురి జిల్లా – ఆలామరొత్తువలావు)
18. లక్ష్మణన్ (పాపిరెడ్డిపట్టి, అరసనత్తం, ధర్మపురి జిల్లా)
19. వెంకటేశ్ (కరక్కపట్టి, ధర్మపురి జిల్లా)
20. మునస్వామి (మేల్కచ్చనూర్)



శ్రీవారిమెట్టు అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలించిన యాభైమంది కూలీలు వాటిని శ్రీనివాస మంగాపురం సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద దాచారు. వెంటపడిన అటవీ అధికారులపై కూలీలు రాళ్లతో దాడి చేశారు. దీంతో అటవీ అధికారులు కాల్పులు చేయాల్సి వచ్చింది. ముప్పైఐదు దుంగలను అక్కడే వదిలేసి అడవుల్లోకి తప్పించుకొని పారిపోయారు. ఈ సంఘటన 2011 నవంబరు 6వ తేదీన జరిగింది. చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లె పంచాయితీ పరిధిలోని టేకువనం వద్ద అటవీ అధికారులకు, తమిళ కూలీలకు మధ్య రాళ్లవర్షం జరిగింది. సాయుధదళాలు అయిదు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు. పరిగెత్తలేక పడిపోయిన లారీ డ్రైవరు రమేష్ ను పట్టుకొని విచారించగా అతడు చెన్నైలోని పూందమలై ప్రాంతం వాడినని అంగీకరించాడు. ఇదే సందర్భంలోనే శక్తివేల్ అనే మరో కూలీ కూడా దొరికాడు. కాల్పుల కారణంగా దాదాపు నలభైమంది కూలీలు శ్రీనివాసమంగాపురం, మిట్ట పాలెం, బచ్చినాయుడు పాలెం మీదుగా పారిపోయారు. లారీ టర్బో వాహనాలతో పాటుగా ఎనిమిది టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. ఈ ఘటన 2011 డిసెంబర్ 20వ తేదీన జరిగింది. వేలూరు నుంచి వస్తున్న శ్రీకాళహస్తి డిపోకి

చెందిన ఆర్టీసీ బస్సును ఆధారంగా చేసుకొని స్మగ్లింగ్ చేయడానికి వస్తున్న ముఠాకూడా ఒకటి దొరికింది.

ప్రయాణీకుల వేషంలో ఆర్టీసీ బస్సులో వస్తున్న కూలీలను రేణిగుంట బైపాస్ రోడ్డుపై తిరుచానూరు సర్కిల్ వద్ద వ్యూహాత్మకంగా పట్టుకోగలిగారు. ఇదే సందర్భం లోనే ఐషర్ లారీలో వస్తూ సుమారు ఐదుటన్నుల బరువున్న 200 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2012 అక్టోబరు 9వ తేదీన జరిగింది. చిత్తూరు జిల్లా భాకరాపేటకు సమీపంలో రంగంపేట బేస్ క్యాంపు వద్ద రాత్రి ఎర్రచందనం స్మగ్లర్లకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు మధ్య కాల్పులు జరిగాయి. కరేపాకుకోన వద్ద స్మగ్లర్లు తిరగబడి రాళ్లు, గొడ్డళ్లతో దాడిచేశారు. భీకరమైన పోరు కొనసాగింది. కాల్పుల్లో తమిళనాడులోని విల్లుపురం జిల్లా ఉప్పూరుకు చెందిన మురుగేశన్ చాతీలోకి బుల్లెట్ దూసుకపోయింది. అదే జిల్లా కరమందొరై గ్రామానికి చెందిన మరో స్మగ్లర్ భాగ్యరాజ్ తొడకు, తలకు బుల్లెట్ తగిలింది. స్మగ్లర్ మురుగేశన్ మృతి చెందగా, ఎస్టీఎఫ్ సిబ్బంది శరవణకుమార్, నిరంజన్, చరణ్‌లతో పాటూ నెరబైలుకు చెందిన ఫారెస్ట్ గార్డు అహ్మద్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. దాదాపు అరవై మంది స్మగ్లర్లు దాడిలో పాల్గొని పారిపోయారు. ఈ సంఘటన 2012 డిసెంబర్ 1వ తేదీ జరిగింది.

రైల్వేకోడూరు మండలం శెట్టిగుట్ట సమీపంలో రాత్రిపూట గస్తీలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్న ఇన్చార్జి ఎఫ్ బీవో జగజ్జీవన్ రావు, శ్రీనివాసరావులపై స్మగ్లర్లు రాళ్లదాడిచేసి వారి ద్విచక్ర వాహనాన్ని పెట్రోల్ తో కాల్చి వేశారు. ఈ విషయాన్ని సిబ్బంది అధికారులకు తెలియపర్చడంతో బాలుపల్లె రేంజర్ క్రిష్ణయ్య తమ సిబ్బందితో కలిసి మాధవరం పోడువద్ద లారీని అందుకొని నలబై ఎర్రచందనం దుంగలను పట్టుకోగలిగారు. స్మగ్లర్లందరూ పారిపోయారు. ఈ సంఘటన 2013 సెప్టెంబర్ 28వ తేదీ జరిగింది. అదే రోజు పోరుమామిళ్ల అటవీ పరిధిలోని ఇటుకలపాడు బీట్ పరిధిలో 250 ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రాజంపేట పరిధిలోని గండ్లూరు అటవీ చెక్ పోస్టు నుంచి ఆకేపాడు క్రాస్ రోడ్డు, కొండ్లోపల్లె, చొప్పవారిపల్లె మీదుగా హైవేకి చేరుకోవడానికి మినీ వ్యాన్లో వస్తున్న స్మగర్లను అటవీ శాఖ సిబ్బంది అడ్డుకున్న సందర్భంలోనూ ఘర్షణ చోటు

చేసుకుంది. స్మగ్లర్లు దాడికి ప్రయత్నించారు. ఈ ఘటన 2013 అక్టోబర్ 26వ తేదీ జరిగింది.

శేషాచలం అడవుల్లో స్మగ్లర్ల ఘాతుకాలకు పరాకాష్ఠ సంఘటన – అటవీశాఖ అధికారులు శ్రీధర్, డేవిడ్ కరుణాకర్లల్ని బలి తీసుకున్న ఘటన. పెద్దబండ చేను వద్ద వందమంది వరకు ఎర్రచందనం స్మగ్లర్లు దుంగలను తరలిస్తున్నారనే సమాచారం మామండూరు బేస్ క్యాంపుకు అందింది. డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీధర్ తనతోపాటూ మరో ఆరుగురు సిబ్బందిని వెంటపెట్టుకొని రెండు టాటా సుమో వాహనాల్లో అక్కడికి బయలుదేరారు. అటవి మధ్యలో దుంగల్ని మోసుకెళ్తున్న కొందర్ని అదుపులోకి తీసుకున్నారు. మరి కొంత దూరంలో గుట్టుగుట్టలుగా పేర్చబడిన ఎర్రచందనం కొయ్యల దగ్గరున్న స్మగ్లర్లను కూడా పట్టుకోవాలనే వ్యూహంలో వుండగానే – అదుపులోవున్న స్మగ్లర్లు గట్టిగా అరచి, దూరంగా ఉన్న వారందర్ని కేకలేసి పిలిచి దాడికి పూనుకున్నారు. దూరం నుంచి ముందుగా స్మగ్లర్లు రాళ్లదాడి చేశారు. అటవీ అధికారులు ఎవరికి వారుగా పరుగులు పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేశారు. రాళ్లు విసురుతూ వెంటపడిన స్మగ్లర్లు అటవీ అధికారి శ్రీధర్ ను కర్కశంగా తలపై రాళ్లతో మోది ప్రాణాలు తీశారు. అంతటితో ఊరుకోకుండా బట్టలు ఊడదీసి చిత్రహింసలు పెట్టి తమ కక్ష చల్లార్చుకున్నారు. గొడ్డలితో దేహంలోని భాగాలను విచక్షణారహితంగా నరికివేశారు. శేషాచలం అడవిలో స్మగ్లర్ల నరమేధంకు ఈ సంఘటన సజీవ సాక్ష్యంగా నిలిచిపోయింది.

ఇదే సంఘటనలోనే మరో అటవీ అధికారి డేవిడ్ కరుణాకర్ కూడా స్మగ్లర్ల చేతిలో క్రూరంగా హత్యకు గురైనాడు. తన దగ్గరున్న సెల్లో 'స్మగ్లర్లు తన వెంట పడ్డారని, తనకు తీవ్రమైన గాయాలయ్యానే విషయాన్ని ముళ్ల పొదలమధ్య కూర్చొని డ్రైవరకు మెల్లిగా అందజేస్తున్న సమయంలోనే స్మగ్లర్లు డేవిడ్ ఆచూకీని గుర్తించేశారు. బయటకు ఈడ్చుకొచ్చారు. రాళ్లతో తలపైన బలంగా మోదారు. గొడ్డలితో కాళ్లను నరికారు. డేవిడ్ అక్కడిక్కడే ప్రాణాలొదిలాడు.

సెల్‌లో సమాచారం అందుకున్న డ్రైవరు ఘటనా స్థలానికి బయలుదేరినప్పటికీ స్మగ్లర్ల రాళ్ల దాడితో భయభ్రాంతులై చల్లాచెదరై పారిపోవాల్సి వచ్చింది. ఐదుగంటల

పాటూ అడవిలో పడ్తూలేస్తూ మామండూరుకు చేరుకోవాల్సి వచ్చింది. ఈ సంఘటన 2013 డిసెంబర్ 15వ తేదీనాడు జరిగింది.

శేషాచలం అడవుల్లో పెద్దఎత్తున కూంబింగ్ చేపట్టిన తర్వాత మర్నాడు వందమంది స్మగ్లర్లు అడవులనుంచి రైల్వేకోడూరు స్టేషన్లో రైలెక్కి పారిపోవడానికి సిద్ధపడగా, పోలీసులు యాభైమందిని అదుపులోకి తీసుకోగలిగారు. రైల్వేకోడూరు స్టేషన్నుంచి కె.బుడుగుంటపల్లె మీదుగా ఉన్న దారిగుండా వీరందరూ శేషాచలంలోకి ప్రవేశిస్తున్నట్లు గుర్తించగలిగారు.

మామండూరు అటవీ ప్రాంతంలో 2014 మే 26వ తేదీన కొబ్బరిపీచు బస్తాలమధ్యన ఎర్రచందనాన్ని స్మగ్లింగు చేయడానికి ప్రయత్నిస్తున్న దుండగులను రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి అదుపు చేయగలిగారు. చాలామంది పారిపోగా పద్నాలుగు మందిని పట్టుకోగలిగారు.

శేషాచలం ప్రాంతంలోని వైకోట, గాదెల అడవుల్లోనూ ఎర్రచందనం స్మగ్లర్లు పోలీసులపైకి 2014 జూన్ 8వ తేదీ రాళ్లదాడి చేశారు. వైకోటకు వెళ్లే మార్గంలోని అరటితోట వద్ద స్మగ్లర్లపై మూడు రౌండ్ల కాల్పులు జరిపి 200 దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకోగలిగారు. రైల్వే కోడూరు మండలం వాగేటికోన, గుంజననది సెక్షన్ పైభాగంలో పోలీసులు కూంబింగ్ చేస్తుండగా స్మగ్లర్లు రాళ్లదాడి చేశారు. పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపినా కూలీలు వెనక్కి తగ్గక పోవడంతో పోలీసులు నేరుగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక తమిళకూలీ చనిపోగా, మిగిలిన వారు పారిపోయారు. 2014 జూన్ 21వ తేదీన ఈ సంఘటన జరిగింది. చనిపోయిన తమిళకూలీ పేరు వీరమణి. వయస్సు 38 సంవత్సరాలు. ఇతడు తమిళనాడు రాష్ట్రంలోని తిరుణ్ణమలై ఇతడి స్వగ్రామం.

తలకోన, బాలపల్లె అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ చేస్తుండగా చిత్తూరు – కడప జిల్లాల సరిహద్దు ప్రాంతంలో స్మగ్లర్లు ఎదురుదాడి చేశారు. ఈ ప్రయత్నంలో గాలిలోకి కాల్పులు జరిపి ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకోవడం జరిగింది. యర్రావారిపాలెం మండలం చింతగుంట గ్రామం అటవీ సమీపంలో 150 ఎర్రచందనం దుంగల్ని స్వాధీనం చేసుకున్న సంఘటన 2014 ఆగస్టు 1వ

తేదీన జరిగింది. ఇది జరిగిన ఐదు రోజులకే గాదెల బీట్ నీసువంకలో పోలీసుల పైకి స్మగ్లర్లు రాళ్లతో ఎదురుదాడి చేశారు. పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు స్మగ్లర్లు మృతిచెందారు. ఇక్కడే అరవై గొడ్డళ్లు, దుస్తులు, బియ్యం, వంట పాత్రలు, గుత్తి నుంచి తిరుపతి వరకు తీసుకున్న రైలు టిక్కెట్లు గుర్తించగలిగారు. ఈ సంఘటన ఆగస్టు 6వ తేదీ జరిగింది.

ఈ ఘటనలో మృతిచెందిన ఇద్దరు తమిళ కూలీలను గుర్తించగలిగారు. ఒకరు రామస్వామి (35), మణి (29), వేలూరు మండలం చిన్న మచ్చూరు గ్రామానికి చెందిన మణి, నమింభటు మండలం మేనాడునూరు గ్రామానికి చెందిన రామస్వాముల మృతదేహాల కోసం మణి భార్య రాజకుమారి, రామస్వామి భార్య హంస 'రాజంపేట'కు వచ్చి తీసుకెళ్లిపోయారు. కడప - చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే తొమ్మిది మంది కూలీలను ఎన్కౌంటర్ చేశారని, సుమారు వెయ్యిమంది తమిళ కూలీలు జైళ్లలో ఉన్నారని మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా విమర్శించాయి. శ్రీలంకలో చిన్న ఘటన జరిగినా పట్టించుకునే తమిళనాడు ప్రభుత్వం ఎర్రచందనం కోసం పనికివస్తున్న తమిళకూలీల విషయం ఆలోచించాలని కూడా వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు.

మూలపల్లి అడవిలో ఎర్రచందనం స్మగ్లర్ల కోసం వెతుకుతున్న 11వ బెటాలియన్, ఎస్టీఎఫ్ బలగాలను చూసి స్మగ్లర్లు అడవిలోకి పారిపోయారు. అటవీ అధికారుల కారును బోల్తా కొట్టించి పారిపోవాలని చూసిన స్మగ్లర్లలో ఒకరిని మాత్రం పోలీసులు అదుపులోకి తీసుకోగలిగారు. పదహారు ఎర్రచందనం కొయ్యలు పట్టుకోగలిగారు. ఈ సంఘటన 2014 సెప్టెంబరు 13వ తేదీన జరిగింది.

బాలపల్లె అటవీ ప్రాంతంలో స్మగ్లర్లను అదుపులోకి తీసుకోవడానికి అటవీ శాఖ సిబ్బంది ప్రయత్నించారు. స్మగ్లర్లు రాళ్లతో, గొడ్డళ్లతో ప్రతిఘటిస్తూనే, ఐషర్ వాహనంలో నింపిన ఎర్రచందనం దుంగలతో తరలించడానికి ప్రయత్నించారు. గాల్లోకి కాల్పులు జరిపి నలబై ఎర్రచందనం కొయ్యలను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు రేణిగుంట పొలాల దిశగా పారిపోయారు. ఈ సంఘటన 2014 సెప్టెంబర్ 16వ తేదీ జరిగింది.

శేషాచలం అడవుల్లో తుంబుర తీర్థం – మామండూరు మార్గంలో తిరుపతి వన్యప్రాణి డివిజన్లో యాభైమంది స్మగ్లర్లకు అటవీ అధికారుల మధ్య రాళ్లదాడి జరిగింది. కళ్లకు లైట్లు వేసి రాళ్లదాడి చేశారు స్మగ్లర్లు. గాల్లోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఏర్పేడు – వెంకటగిరి మార్గంలో లారీలో ఎర్రచందనాన్ని పట్టుకున్నారు. ఈ సంఘటన 2014 అక్టోబర్ 30వ తేదీన జరిగింది.

బాలపల్లె నుంచి మామండూరు అడవుల వరకు అడవుల్లో కూంబింగ్ జరుగుతున్న సందర్భంలో శెట్టిగుంట పరిసర ప్రాంతాల్లో ఐదుమంది తమిళ కూలీలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. 2014 నవంబరు 27వ తేదీ ఈ సంఘటన జరిగింది. అదేరోజు కోడూరు మండలంలోని రాఘవరాజపురం, ముష్టేరువద్ద ఎర్రచందనం దుంగల్ని స్వాధీనం చేసుకున్నారు.

బాలపల్లె రేంజి పరిధిలోని అడవుల్లో పోలీసులకు, తమిళ కూలీలకు మధ్య జరిగిన ఘర్షణలో తమిళ కూలీలు తమ వద్దవున్న రాళ్లు, గొడ్డళ్లు, కత్తులు, రంపాలతో పోలీసుల పైకి దాడి చేశారు. తమిళ కూలీలు కోవిందన్, కొలయన్, వెంకటేశన్, ఆండి, పళణిస్వామి, చిన్నదొరై, కోవిందన్, తంగరాజు, నటరాజన్, గుచ్చోశర్మ, ఆండి కుమార్, కుమార్, కొలదివేల్ – పదమూడు మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సోమశిల వెనుక ఉన్న జిల్లాల్లోనూ, జలాశయంలోనూ ఎర్రచందనం దుంగలు పలుమార్లు బయటపడుతూ వచ్చాయి. కడప – నెల్లూరు సరిహద్దుల్లోని సోమశిల జలాశయంకు సమీపంగా ఉన్న వెలిగొండ అడవుల్లోంచి ఎర్రచందనం కొయ్యలను నీళ్లలో డంప్ చేసుకుంటూ పోయారు. రాపూరు, రాజంపేట, ఉదయగిరి, ఆత్మకూరు ప్రాంతాలమీదుగా వీటిని చెన్నైకి తరలించుకుపోతూ వచ్చారు. జలాశయం దగ్గర మత్స్యకారుల్లా తమిళ కూలీలు చేరిపోయారు. తిరుమల ఆలయానికి వచ్చే భక్తుల రూపంలోనూ వందల సంఖ్యలో తమిళ కూలీలు శేషాచలానికి చేరుకుంటున్న ఆధారాలు ఎన్నో బయటపడ్డాయి. చేపల వేట పేరుతో పెద్ద ఎత్తున తమిళ కూలీలు సోమశిల వైపు నుంచి అడవుల్లోకి ప్రవేశించారు. ఏడాదికి కనీసం పదినుంచి ఇరవై టన్నుల ఎర్రచందనం దుంగలు సోమశిల జలాశయంలో అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకుంటూనే ఉన్నారు.

సోమశిల వెనుక జలాల తీర ప్రాంతాలైన కడపజిల్లా ఒంటిమిట్ట మండలం బండారుపల్లి, అట్లూరు, కుడుములూరు, బద్వేలు, నందలూరు ప్రాంతాలలోని కోనాపురం, కొమ్మూరు ప్రాంతాల్లో చేపలవేట సాగుతోంది. దీని ముసుగులో ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోంది. అడవి నుంచి తెచ్చిన ఎర్రచందనం దుంగల్ని నీళ్లలోపడే అదునుచూసి పడవల ద్వారా ఒడ్డుకు చేర్చి తరలించుకోవడం స్మగ్లర్లు వ్యూహంగా మార్చుకున్నారు. దీన్ని అడ్డుకోవడానికి అటవీశాఖ 'ఎకో టూరిజం' పథకాన్ని తీసుకొచ్చిన ప్రయోజనం లేకపోయింది.

ఎర్రచందనం సరికే తమిళ కూలీలను చెన్నై నుంచి రాజంపేట (కడప జిల్లాకు తరలిస్తున్న నలభై రెండు మంది ఆర్టీసీ డ్రైవర్లు 2014 డిసెంబరు 2వ తేదీన అరెస్ట్ కాబడ్డారు. చెన్నైలోని కోయంబేడు బస్టాండులో ప్రయాణీకులను ఎవ్వరినీ ఎక్కించుకోకుండా సీట్లు రిజర్వు అయ్యాయని కొద్ది దూరం వచ్చిన తర్వాత మార్గ మధ్యలో తమిళ కూలీలను ఎక్కించుకునేవారు. మధ్యలో ఎక్కడా బస్సును ఆపేవారుకాదు. బస్టాండు వైపు వెళ్లకుండా బైపాస్ రోడ్డు మార్గాన కుక్కలదొడ్డి, రైల్వే కోడూరు, రాజంపేట పరిసర ప్రాంతాల్లో కొంతమందిని దించుకుంటూ కడపకు చేరుకునేవారు. రాజంపేట – రోళ్లమడుగు రహదారి దగ్గర అడవిలోంచి ఎర్రచందనం దుంగలు తీసుకొస్తున్న తమిళ కూలీలను పట్టుకొని పోలీసులు విచారించినప్పుడు పలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

కొంతమంది డ్రైవర్లు అదే పనిగా డ్యూటీలు వేయించుకొని, ఎక్కువ సార్లు చెన్నై రూట్లో వెళ్లడం కూడా బయటపడింది. ఒక్కొక్క తమిళ కూలీ నుంచి రెండు వేలు నుంచి మూడు వేల వరకు తీసుకుంటూ ఆర్టీసీ డ్రైవర్లు ఈ పనిచేశారు. నంద్యాల డిపోకు చెందిన సయ్యద్ అక్బర్ హుస్సేన్, నరసింహులు, ఎస్ఎంజె బాషా, బాబీ, సుబ్బారావు, శ్రీనివాసులు, ఆళ్లగడ్డ డిపోకి చెందిన గోవిందయ్య, వెంకటేశ్వర్లు, కర్నూలుకు చెందిన మద్దిలేటి, బండి ఆత్మకూరుకు చెందిన ధర్మారెడ్డి – డ్రైవర్లను అరెస్ట్ చేసి రిమాండుకు పంపారు. రిజర్వేషన్ చార్టు, టిమ్స్ మిషన్ డేటా, డ్యూటీ చార్టు ఆధారంగా మొత్తం 42 మంది డ్రైవర్లు అరెస్ట్ కాబడ్డారు. డ్రైవర్లు డబ్బు కోసం కూలీలను తరలించేందుకు స్మగ్లర్లతో ఒప్పందాలు చేసుకున్న సంఘటనలు వెలికివచ్చాయి.

ఆర్టీసీకి చెందిన డ్రైవర్లు ముందుగానే బస్సు నంబర్లను స్మగ్లర్లకు అందించే వారు. రోళ్లమడుగు అటవీ ప్రాంతంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన సేలం జిల్లా ఎరుక్కాడ తాలూకాకు చెందిన వెల్లియం కుంబన్, రవిచంద్రన్, పళని, ఏలుమలై సురేష్, తిరువణ్ణామలైకు చెందిన పొన్నుస్వామి, పచప్పన్, రామన్ సుబ్రమణి – తమిళ కూలీలు కూడా ఇదే సందర్భంలో పోలీసుల చేతికి చిక్కారు.

మరో మార్గం ద్వారా ప్రైవేటు బస్సుల్లో ఎవరికీ అనుమానం రాకుండా లగేజీ తరహాలో ప్యాక్ చేసి అక్రమ రవాణా చేస్తూ స్మగ్లర్లు కొత్తదారి వెతుక్కున్నారు. హైద్రాబాదు, చెన్నై, బెంగుళూరు వంటి నగరాలకు వెళ్లే బస్సుల్లో లగేజీగా చూపించి బాక్సులను డిక్కీల్లోకి లోడ్ చేయడం. బస్సు తెల్లారే లోపు గమ్యస్థానాలకు చేరుకోవడంతో స్మగ్లర్ల పని సులువుగా మారింది. ప్రైవేటు ట్రావెల్స్ నడిపే బస్సులు వీరికి సాధనంగా మారాయి.

చిత్తూరు జిల్లా కె.వి. పల్లి మండలం, యర్రావారిపల్లె మండలాల పరిధిలోని స్మగర్ల గురించి స్థానికులు ఎప్పుడో బయట పెట్టారు. రాయచోటి మండలంలోని ముడుంపాడు, వీరబల్లి మండలంలోని వంగిమళ్ల, గడికోట, సానిపాయ, గువ్వల చెరువు, మద్దిమడుగు, రాజంపేట, సిద్ధవటం, ఒంటిమిట్ట ప్రాంతాల నుంచి కూలీలు అడవుల్లోకి స్మగ్లర్లు చూపించే కరెన్సీ నోట్లకు ఆశపడి పోయారు. వారాల తరబడి అడవుల్లోనే ఉండి చెట్లను కొట్టించే వాళ్లు. నిర్ణీత ప్రాంతానికి దుంగలు చేర్చితే అక్కడ తూకం వేసి కిలోకి ఇంత డబ్బు చెల్లించేవారు. శేషాచలం కొండల్లోని తుమ్మల ఓటు బంగళా, చాకిరేవుబండ, సానిపాయ రోడ్డు వంటి ప్రాంతాలు కీలకంగా ఉండేవి. అటవీ శాఖ సిబ్బందిలో ఏర్పడిన అంతర్గత వైరుధ్యాలు, విభేదాల కారణంగా వసూళ్లను పక్కన పెట్టి పనిచేయడం వల్ల 2003 సంవత్సరంలోనే దాదాపు 400 వరకు ఎర్రచందనం దుంగల్ని ఈ ప్రాంతాల్లో పట్టుకోగలిగారు. కడప జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లుగా పేరుపొందిన రెడ్డి నారాయణ, మహేష్ నాయుడుల అరెస్టు తర్వాత కొంత అక్రమ రవాణా తగ్గింది. 2013 ప్రాంతంలో సానిపాయ ప్రాంతంలో సుండుపల్లెలోని అటవీ సిబ్బంది అక్రమ రవాణాకు సహకరిస్తూ పట్టుబడ్డారు. ఎర్రచందనం లోడుతో ఓ వాహనం సద్దికోళ్లవంక చెక్ పోస్టు దాటేందుకు పదైదు వేలు తీసుకొని, యాభైవేలకు కుదుర్చుకున్న ఒప్పందాన్ని అప్పటి టాస్క్‌ఫోర్స్

ఓఎస్టీ ఉదయకుమార్ బట్టబయలు చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అటవీ అధికారులు, పోలీసులు అక్రమార్కులకు సహకరిస్తున్న సంఘటనలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. బద్వేలు అటవీ రేంజ్ నుంచి ఇరవైరెండు ఎర్రచందనం దుంగలు మాయమైపోయాయి.

ప్రొద్దుటూరు అటవీ డివిజన్లోని పోరుమామిళ్ల రేంజ్ లోని వివిధ బీట్ల పరిధిలోని నలుగురు గార్డులు, ముగ్గురు సెక్షన్ అధికారులను 2013 సెప్టెంబర్ మొదటి వారంలో సస్పెండ్ చేశారు. కడప నడిబొడ్డున ఉన్న డీఎఫ్ ఓ కార్యాలయంలో ఉంచిన 75 ఎర్రచందనం దుంగలు ఎవరో ఎత్తుకెళ్లారు. అప్పటి అధికారి శివానీడోగ్రా దీనిపై విచారణకు ఆదేశించారు. నిమ్మకాయలబండ అటవీ ప్రాంతం (లంకమల)లో పన్నెండు ఎర్రచందనం దుంగలు పట్టుకున్న సందర్భంలోనూ ఓ హోంగార్డును అరెస్ట్ చేశారు. సిద్దవటం రేంజ్లోని గొల్లపల్లె బీట్లో 2014 జూన్ 28 నాడు 29 దుంగలను వీళ్లిచ్చిన సమాచారంతో స్వాధీనం చేసుకోగలిగారు. చిట్వేలి రేంజ్లో 2013 సెప్టెంబరు 8న కొబ్బరి మొక్కల మాటున లారీలో 107 దుంగల్ని పట్టుకున్నారు. ఆ దుంగల్లో మరుసటి రోజు రాత్రి 32 వరకు కనపడకుండా పోయాయి. సిబ్బంది ప్రమేయం పై రాజంపేట డీఎఫ్వో విచారణకు ఆదేశించారు. 2014 మే 1వ తేది రామాపురం చెక్ పోస్టు మినీ లారీలో అక్రమంగా తరలిస్తున్న పదమూడు ఎర్రచందనం దుంగల్ని పట్టుకున్నప్పుడు వాటి పై గుర్తులుండడంతో అవి గతంలో ఫారెస్ట్ గోదాలోనివే అని తేలింది. కర్నాటకకు చెందిన నారాయణరాజ్, సత్యరాజ్ అనే ఎర్రచందనం కేసు నిందితులు గదిలోని కిటికీని తొలగించి పారిపోయారు. ఓబులవారిపల్లె మండలం గాదెలవద్ద పట్టుకున్న రెండువందల ఎర్రచందనంను అడవి దాటించడంలోనూ సిబ్బంది పాత్రపై అనుమానాలు వ్యక్తమైనాయి. తర్వాత వారిపై చర్యతీసుకొని రిమాండుకు కూడా పంపారు. 2014 జులై 2 నాడు నందలూరు వద్ద ముప్పైఐదు ఎర్రచందనం దుంగల్ని స్వాధీనం చేసుకున్నారు. వాటిపై విచారణ చేయగా అవి చిట్వేలి గోడౌన్ నుంచి దొంగలించినట్లు వెల్లడైంది. 2014 ఆగస్ట్ 9వ తేదీ 30 ఎర్రచందనం

దుంగల్ని చెన్నైకి తరలిస్తున్న డ్రైవరు శాంతకుమార్ ను పట్టుకున్నారు. అయితే తెల్లారేపాటికి అతను పరారైపోయాడు.

శేషాచలం అడవిలో భాగమైన రాజంపేట అటవీ డివిజన్ పరిధిలో 2004లో 41 కేసులు నమోదుకాగా 167 మందిని అరెస్ట్ చేశారు. అలాగే 2005లో 71 కేసుల్లో 206 మంది, 2006లో 64 కేసుల్లో 130 మంది, 2007లో వంద కేసుల్లో 142 మంది, 2008లో 44 కేసుల్లో 55 మంది, 2009లో 52 కేసుల్లో 101 మంది, 2010లో 108 కేసుల్లో 153 మంది, 2011లో 140 కేసుల్లో 289 మంది, 2012లో 108 కేసుల్లో 265 మంది, 2013లో 298 కేసుల్లో 611 మందిని అరెస్ట్ చేశారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలో పనిచేసిన కొందరు పోలీసు అధికారులు ఎర్రచందనం వాహనాలను సరిహద్దులు దాటించడం, తప్పని పరిస్థితుల్లో దాడులు చేయవలసి వస్తే ముందుగానే స్మగ్లర్లకు సమాచారం అందిస్తున్న సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఎర్రచందనం కొయ్యలు తరలిపోతున్న పట్టుకోకపోవడం, పట్టుకున్నప్పటికీ బేరాలు కొనసాగించడంతో ఇద్దరు డీఎస్పీ స్థాయి అధికారుల్ని 2014 సెప్టెంబరు 19వ తేదీన ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తిరుపతిలో టాస్క్‌ఫోర్స్ ఓఎస్టీగా పనిచేసిన జి. ఉదయకుమార్, రాజంపేట డీఎస్పీగా పనిచేసిన జి.వి. రమణలపై వేటుపడింది. ఎర్రచందనం స్మగ్లర్ కొల్లం గంగిరెడ్డిపై కర్నూలు జిల్లా డోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. 2008లోనూ కడప జిల్లాలో ఒకేసారి ఇరవై ఒక్కమంది పోలీసులపైన, పన్నెండుమంది అటవీ సిబ్బందిపైన చర్యలు తీసుకున్నారు. వీరిలో ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు కూడా ఉండడం విశేషం. రాయలసీమ పరిధిలోని కడప, ప్రొద్దుటూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు తూర్పు, నెల్లూరు అటవీ డివిజన్ల నుంచి ఇరవై ఎనిమిది మంది అటవీ సిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. ముద్దనూరు ఫారెస్ట్ రేంజి కార్యాలయం గోడౌన్లో ఉన్న 130 ఎర్రచందనం దుంగలు మాయమైపోయాయి. ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేశారు. అవే దుంగలే తర్వాత యామవరంలోని పొలం వద్ద బయటపడ్డాయి. ఎఫ్ఆర్వోను సస్పెండ్ చేశారు.

ఎర్రచందనం అక్రమరవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, వైర్లెస్ నెట్‌వర్క్‌లను అటవీశాఖ ఏర్పాటు చేసింది. కానీ భాకరాపేట నుంచి వస్తున్న లారీలో 2014 డిసెంబరు 7వ తేదీ అర్ధరాత్రి తొంభైనాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆరోజు చెక్ పోస్టు వద్ద విధులు నిర్వర్తించాల్సిన ఇద్దరు ఫారెస్ట్ బీటు అధికార్లు సీసీ కెమెరాలను పనిచేయకుండా చేశారనే కారణంతో సస్పెండ్ చేశారు. 2015 మార్చిలో ప్రభుత్వం ఎర్రచందనం వేలం వేయాలని భావించి గోడౌన్లలోని కొయ్యల వివరాలు సేకరించినప్పుడు కడపలో 400 దుంగలు, అనంతపురంలో 150, పుంగనూరులో 140, ముద్దనూరులో 136 దుంగలు అటవీశాఖ అధికారిక గోడౌన్లలో కన్పించకుండా పోయిన వాస్తవాలు బట్టబయలైనాయి. ఐఎఫ్ఎస్ అధికారి రాజేష్ మిత్తల్ ఎర్రచందనం ఎగుమతి, అనుమతులు పొందడంలో సక్రమంగా వ్యవహరించనందు వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అదే విధంగా 2008లో ఎర్రచందనం వేలంకు సంబంధించిన కీలక పత్రాలు - వేలంలో పాల్గొన్నవారు, కొనుగోలు ఖరారు చేసుకున్నవారు, ఇతర సంస్థలతో అటవీశాఖ అధికారులు సాగించిన ప్రత్యుత్తరాలువంటి పత్రాలు ఏవీ కనిపించకపోవడం మరొక విశేషం.

తమిళనాడు రాష్ట్రంలోని ధర్మపురి, సేలం, తిరువణ్ణామలై, వేలూరు, కాంచీపురం, తిరువల్లూర్ జిల్లాల పరిధిలోని జమునామరత్తూర్, దానమత్తూర్, వీరప్పనూర్, కోమటేరు, పల్లంబట్టు, కావలూరు గ్రామాల్లోని నిరక్షరాస్య నిరుపేద కూలీలను స్మగ్లర్లు పావులుగా మార్చుకుంటున్నారు. 2012 ఏప్రిల్ 1వ తేదీన శ్రీవారిమెట్టు మార్గం ద్వారా తిరుమలలోనికి ప్రవేశిస్తున్న యువకుల బృందాన్ని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 19 మంది ముఠా ఎర్రచందనాన్ని కొట్టడానికి తిరువణ్ణామలై నుంచి వస్తున్నట్లు అంగీకరించారు. నిందితుల్లో శివాజీ, ప్రకాష్, రామలింగం, అయ్యాస్వామి, కమలనాథ్, ప్రకాష్, అన్నబలగం, దశరథన్, సన్నప్పయ్యన్, కుమార్, బాబు, అప్పాస్వామి, ముత్తుస్వామి, ప్రభు, పెరియార్, అన్నాదొరై, సెంథిల్, అంగరాజ్లు ఉన్నారు. ప్రతి రోజూ వేల సంఖ్యలో తిరుమలకు భక్తుల ముసుగులో కూలీలు చేరుకుంటూ వచ్చారు. కొండమార్గం లోని నడక మార్గం ద్వారా, వాహనాల ద్వారా, బస్సుల ద్వారా వీరంతా తిరుమలకు చేరుతున్నారు.

తిరుమల ముఖద్వారమైన గరుడాద్రి టోల్గేట్ వద్ద గట్టి నిఘా లేకపోవడం కూడా ఒక కారణంగా చెప్తున్నారు. భాకరాపేట, ఎర్రావారిపాళెం, ఐతేపల్లి, కల్లూరు, చంద్రగిరి, శేషాచలం అడవులనుంచి పీలేరు మీదుగా కర్నాటకకు తరలించే మార్గాన్ని స్మగ్లర్లు ఉపయోగించుకుంటూ వచ్చారు.

భాకరాపేట కనుమరోడ్డులో చామలరేంజ్లో పనిచేస్తున్న అటవీ అధికారులు ప్రభాకర్ రెడ్డి, జయరామయ్య, చొక్కలింగంలను చెట్టుకు కట్టేసి రాళ్లతో మూకుమ్మడి దాడులు చేసి చంపేశారు. 2010లో ఈ సంఘటన జరిగింది. కేవీబీపురం మండలం అంజూరులో సహాయ బీటు అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసుల్ని ఏర్పేడు – వెంకటగిరి మార్గమధ్యంలోని జంగాలపల్లి ఎర్రచందనం రవాణాచేసే స్మగ్లర్లు 2011 జూలై 13వ తేదీన బలితీసుకున్నారు. శ్రీవారిమెట్టు సమీపంలోని పులిబోను అటవీ ప్రాంతంలో 2012 డిసెంబర్ 1వ తేదీన జరిగిన ఎన్ కౌంటర్లో తమిళనాడుకు చెందిన మురుగేష్ అనే స్మగ్లర్ చనిపోగా, భాగ్యరాజ్ ను పట్టుకోగలిగారు.

కడప జిల్లాలోని పాలకొండల్లో, చిత్తూరు జిల్లాలోని శేషాచలం సానువుల్లో మూడు రోజులు నిఘా పెట్టి దాడిచేయగా వేలూరు జిల్లా వడగత్తులూరుకు చెందిన 34 మంది కూలీలు దొరికారు. అదే సమయంలో నలభైరెండు ఎర్రచందనం దుంగల్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన 2013 ఫిబ్రవరి 12వ తేదీన జరిగింది.

లింగాల ప్రాంతం నుంచి చెన్నైకి ఎరువుల లారీలో దుంగల్ని రవాణాచేస్తున్న ముఠాను పోలీసులు 2011 ఫిబ్రవరి 16వ తేదీనాడు అప్పటి ఎస్పీ తరుణ్ జోషి మీడియాముందు పెట్టారు. 101 దుంగలను, ఎనిమిది వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చంద్రగిరి మండలం శ్రీనివాసమంగాపురం సమీపంలోని చందమామపల్లి వద్ద శేషాచల అటవీ ప్రాంతం నుంచి వస్తున్న పది టైర్ల పెద్ద లారీ నుంచి 15 టన్నుల ఎర్రచందనం దుంగల్ని 2012 సెప్టెంబర్ 15 నాడు స్వాధీనం చేసుకున్నారు.

బద్వేలులోని తెలుగుగంగ కాలువ పక్కన డంప్ చేసి ఉంచిన 333 ఎర్రచందనం దుంగల్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దవటం రేంజి

కొండూరు బీటులోని కుక్కలగుంత అటవీ ప్రాంతంలో 72 దుంగల్ని పట్టుకున్నారు. ఒంటిమిట్ట మండలం మంటపంపల్లి బీటు పరిధిలో దాచివుంచిన 30 దుంగల్ని కూలీలను అరెస్ట్ చేశారు. 2011 సెప్టెంబరు 11నాడు ఈ సంఘటన జరిగింది. రేసింగు కారులో తరలిస్తున్న 11 ఎర్రచందనం దుంగల్ని సందలూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సానిపాయ అటవీ పరిధిలోనూ 20 ఎర్ర చందన దుంగల్ని పట్టుకున్నారు. .

2013 డిసెంబరు 19వ తేదీన రేణిగుంట వైపునుంచి కడపకు వెళ్తున్న అరటి ట్రేల లారీనుంచి 38 దుంగల్ని పట్టుకున్నారు. సావిశెట్టిపల్లె వద్ద 18 దుంగల్ని అదేరోజే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శెట్టిగుంట పంచాయితీ గుంజన నది దక్షిణ బీట్ మైదానంలో 120 ఎర్రచందనం దుంగల్ని పట్టుకున్నారు. కూలీ నాగయ్యను లోపలేసినారు. నల్లమల అడవులనుంచి ఎర్రచందనాన్ని తరలిస్తున్న నెల్లూరు, ఒంగోలుకు చెందిన స్మగ్లర్లు వనిపెంట వద్ద పట్టుబడ్డారు. వారినుంచి 78 దుంగల్ని స్వాధీనం చేసుకున్నారు.

2010-2011లో శేషాచలం అడవి నుంచి యాభైవేల దుంగల్ని పట్టుకోగలిగారు. కానీ అక్రమంగా జరిగిపోతున్న రవాణాలో ఇది కేవలం యాభై శాతమే అనేది వాస్తవం.

జమ్మలమడుగు శివారులోని గొరిగెనూరు - అంబవరం పొలాల్లో 2013 మే 23న 433 దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కొన్ని దుంగల పై కేసు వివరాలు నమోదు ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమైనాయి. ప్రొద్దుటూరు నుంచి ఆర్టీపీపీకి వెళ్లే దారిలో అక్రమంగా నిల్వఉన్న 108 ఎర్రచందనం దుంగల్ని, మూడు వాహనాలను పట్టుకున్నారు. బద్వేలు రేంజి నక్కలగండి ప్రాంతంలో 33 ఎర్రచందనం దుంగల్ని ముళ్లపొదల్లోంచి బయటికి తెచ్చారు. 2013 నవంబరు 8 నాడు చంద్రగిరి మండలం, కొంగరవారిపల్లె వద్ద తెల్లవారుజామున మూడు అంబులెన్సులో రెండు టన్నుల బరువున్న నలభై ఎర్రచందనం దుంగల్ని తీసుకెళ్తున్న 69 మంది కూలీలను పట్టుకున్నారు. 2002 నుంచి 2015 మధ్య కాలంలో ఎర్రచందనం స్మగ్లర్లపై 12,300 కేసులు నమోదయ్యాయి.

12,863 మెట్రిక్ టన్నుల దుంగలు, 7,220 వాహనాలు, 18, 703 మంది నిందితుల్ని అరెస్ట్ చేశారు. 40 మంది పై పీడీయాక్ట్ ప్రయోగించారు.

గుండ్లూరు నుంచి బగిడిపల్లి మీదుగా పులపుత్తూరుకు వెళ్లే మార్గం ద్వారా అక్రమంగా తరలిస్తున్న నలబై ఎర్రచందనం దుంగలు 'అంబులెన్స్'లో దొరికాయి. కడప-చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతమైన దిన్నెలబీట్ పరిధిలోని అమ్మబాయి వద్ద 34 దుంగల్ని పట్టుకున్నారు. ప్రొద్దుటూరు డివిజన్ ఖాజీపేట సెక్షన్ పత్తూరు బీట్లో 2011 జూన్ 14వ తేదీన రెండు ఎద్దుల బండ్లపై తరలిస్తున్న 74 దుంగల్ని స్వాధీనం చేసుకున్నారు. కుక్కలదొడ్డి నుంచి కోడూరువైపు వస్తున్న మినీ లారీలో 42 దుంగల్ని పట్టుకున్నారు. సుండుపల్లి మండలం, పెద్దినేనికాలువ పంచాయితీలోని నాగారపమ్మ ఆలయంకు సమీపంలో 23 దుంగల్ని స్వాధీనం చేసుకున్నారు. 2013 జనవరి 26వ తేదీ నాడే ఖాజీపేట మండలం ఏటూరు సమీపంలో కోటి రూపాయలు విలువచేసే ఎర్రచందనం పట్టుబడింది.

కర్నూలు జిల్లా బనగానపల్లి నియోజకవర్గంలోని కొలిమిగుండ్లకు సమీపంలో రామేశ్వరరెడ్డికి చెందిన పొలంలో వరిగడ్డి, పత్తికట్టె కింద దాచిన 400 దుంగలను పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. కడప-నెల్లూరు జిల్లాలను అనుసంధానం చేసే రాపూరు -చిట్వేల్ ఘాట్ రోడ్డులోని వెలిగొండల్లో ఐదురౌండ్ల కాల్పులు జరిగాయి. తమిళ కూలీలు పారిపోయిన సంఘటన జరిగింది. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని కొత్త మంగంపేట వద్ద ముగ్గురాళ్ల మాటున 141 ఎర్రచందనం దుంగల్ని తరలిస్తున్న వాళ్లని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2012 జూలై 4వ తేదీన ఈ సంఘటన చోటుచేసుకుంది. ఖాజీపేట మండలం కన్నెలవాగు సమీపంలోని గోపాలబావి దగ్గర రవాణా కోసం దాచి ఉంచిన 120 ఎర్రచందనం దుంగల్ని, మూడు ఎద్దుల బండ్లను పట్టుకున్నారు.

రాయచోటి రేంజ్‌లోని జాలాకోన వద్ద 2013 ఫిబ్రవరిలో ఇరవై అయిదు మంది తమిళ కూలీలను అప్పటి కడప ఎస్పీ మనీష్ కుమార్ సిన్హా పట్టుకున్నట్లు ప్రకటించారు. అదే నెల 22 నాడు మూడు వేర్వేరు ప్రాంతాల్లో 21 మంది తమిళ కూలీలను పట్టుకున్నారు. మడితాడు పరిధిలోని మల్లప్పకోనవద్ద ఏడు మందిని,

వానరాచపల్లె బీట్లో ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. పొన్నుస్వామివేలు, రాజగోపాల్ రమేషన్, చిన్నప్పయార్ సెల్వ, పెరియస్వామీ చిన్నదొరై, కన్నియన్ శ్రీనివాసన్, ముత్తుస్వామీప్రభు – అనే తమిళ కూలీలు మల్లప్పకోనవద్ద పట్టుబడ్డారు.

మురుగేష్, రామరాజు, ప్రభు, రామలింగం, కరియప్ప, రాము, నయాజ్, ఇమ్రాన్ షరీఫ్లు – టేకల కోనవద్ద చిక్కారు. అదే విధంగా సుండుపల్లె బీట్ పెద్ద తిప్పకోన సమీపంలో తమిళ కూలీలు సౌందర్ కుమార్, చంద్రరంగం, రాధాకాశీ, మైల వెంకటేష్, పొన్నుస్వామి, చిన్నయప్ప పట్టుపడ్డారు.

తిరుమల పాప వినాశనం మార్గంలోని అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం దుంగలను కార్లద్వారా తరలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాయచోటి ప్రాంతంలోని సంబేపల్లి మండలంలోని మోటకట్ల, గున్నికుంట్ల గ్రామాల్లో తిరుగుతున్న తమిళ కూలీలను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఐదు రోజులుగా ఇదే ప్రాంతంలో ఉంటూ రాత్రివేళ అడవుల్లోకి వెళ్తున్న వీళ్లను అనుమానంతో పట్టించారు. 2013 మే 19వ తేదీ వీరందరూ అరెస్ట్ అయ్యారు. శ్రీవారిమెట్టు మార్గంలో ఎర్రచందనం కొట్టడానికి వస్తున్న 45 మంది తమిళ కూలీలను 2013 జూలై 3వ తేదీన అదుపులోకి తీసుకొని 20 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. తమిళనాడులోని మాదరపాకం గ్రామ సమీపంలోని పొలాల్లో దాడులు చేసినప్పుడు 220 ఎర్రచందనం దుంగలు దొరికాయి. ఎర్రచందనం కొయ్యలు వెంకటగిరికి చెందిన కొండయ్య, శ్రీకాళహస్తికి చెందిన బాలయ్య, కేవీబీ పురానికి చెందిన దొరైరాజ్, తిరుపతికి చెందిన కర్ణ, చెన్నైకి చెందిన రాములు సరఫరా చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. టవేరా వాహనంలో అక్రమంగా ఎర్రచందనాన్ని తరలిస్తున్న చెన్నైకి చెందిన చంద్రశేఖర్, సత్యవేడుకు చెందిన షరీఫ్లు అందించిన వివరాల ఆధారంగా వాస్తవాలు తెలిసివచ్చాయి. 2012 జూలై 8వ తేదీన ఈ సంఘటన జరిగింది.

ప్రతి సంవత్సరం దాదాపు మూడువందల కోట్లకుపైగా విలువైన ఎర్రచందనం అక్రమంగా చెన్నైపోర్టు ద్వారా, రోడ్డు మార్గాల ద్వారా తరలిపోతూ వస్తోంది. 2012

సం॥లోనే 1250 టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 187 కోట్లు ఉండవచ్చని అంచనా. కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో దాదాపు రెండువందల మంది పేరుమోసిన స్మగ్లర్లు రికార్డులకెక్కారు.

చిత్తూరు, కడప జిల్లాలలో అడవుల్లో ఎక్కడెక్కడ పెద్ద ఎర్రచందనం ఉన్నాయో ఆ ప్రదేశాలను గుర్తించి తమకు చెప్పినందుకు అధికసొమ్మును ఏజెంట్లు అందజేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కూలీలను ఏర్పాటు చేసుకొని కొట్టించి ఇస్తామని స్థానిక ఏజెంట్లు ముందుకు వస్తే వారికే ఆ బాధ్యతను, దానికి తగిన మొత్తాన్ని కూడా అందజేస్తారు. కూలీలు కొట్టిన దుంగలను స్థానికంగా గోడౌన్లలోనూ, పొలాల్లో, స్థావరాల్లో రహస్యంగా భద్రపరిచే పనులకు కూడా స్థానిక ఏజంట్లే కీలకంగా మారుతున్నారు. స్థానిక పోలీసులతో, అటవీ అధికారులతో పటిష్ట సంబంధాలు ఏర్పరచుకొని వారందరికి ముడుపులు చెల్లిస్తున్నారు. కిందిస్థాయి అధికారులందరికీ లక్షల్లో ముడుపులు అందించి తమ పనిని చాపకింద నీరులా చేసుకపోతున్నారు.

ఎర్రచందనం దుంగలు లారీకి లోడ్ అయిన తర్వాత చెకపోస్టు సిబ్బంది మొదలు దారిలో అడ్డుపడే వారందరికీ భారీగా సొమ్ము పంచుకుంటూ ముందుకు సాగిపోతారు. రకరకాల మార్గాల ద్వారా చెన్నైకి చేరుకోవడంతో సగం పని ముగుస్తుంది.

సరుకునంతా ఒకేసారిగా కాకుండా కొంత కొంతగా తరలించుకుంటారు. మారుమూల గ్రామాల్లోని గోడౌన్లలోనో, తోటల్లోనో నిల్వ చేసుకోవడానికి ఏర్పాటు చేసుకుంటారు. ఓడరేవుల్లో తమకు అనుకూలమైన వాతావరణం ఉన్నప్పుడు పోర్టుకు తరలిస్తారు. పోర్టు అధికారులకు అధిక మొత్తాలు ఆశచూపించి ఓడల ద్వారా విదేశాలకు పంపిస్తారు. అంతర్జాతీయ స్మగ్లర్ల చేతికి ఈ విధంగా ఎర్రచందనం చేరుతోంది. చెన్నైనుంచే కాకుండా దేశంలోని వివిధ ఓడరేవుల్ని తమకు వీలుగా ఉపయోగించుకుంటున్నారు. మంగుళూర్, కాండ్లా, ముంబై, విశాఖపట్నం వంటి ఓడరేవుల్లోని కంటైనర్లలో భారీ ఎత్తున ఎర్రచందనం నిల్వలు ఉన్నట్లు పలుసార్లు గుర్తించగలిగారు. అదే ఇప్పటికీ కొనసాగుతోంది.

ఎర్రచందనం అక్రమ రవాణాలో పట్టుబడే తమిళ కూలీలకు బెయిల్ కోసం ప్రత్యేకంగా ఏజెంట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. వారంలోగా వారికి కావలసిన అన్ని పత్రాలు తయారుచేసి విడిపించుక పోతున్నారు. ఒక్కో నిందితుడి కోసం రెండు, మూడు బెయిల్ పిటిషన్లు కూడా దాఖలు చేస్తున్నారు. తమిళ కూలీల ఓటరు, ఆధార్, పాన్, రేషన్ కార్డులను న్యాయవాదులకు సమర్పిస్తున్నారు. నిందితులకు బెయిల్ కోసం ఆ ప్రాంతవాసితో పాటూ, ఇదే జిల్లాకు చెందిన మరొకరి పూచీకత్తు అవసరం అవుతుంది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లను ఏజంట్లు దగ్గరుండి చూసుకుంటారు. ఒక్కో నిందితునికి పదివేల నుంచి యాభైవేల వరకు బ్యాంకు ఖాతాల్లో మొత్తాలను కూడా వీరే జమచేస్తున్నారు. తమిళ కూలీలను విడిపించడం కోసం బెయిల్ కోసం అన్ని పత్రాలను సమకూర్చిపెట్టే ముఠాను కూడా పోలీసులు అదుపులోకి తీసుకోవలసి వచ్చింది. నకిలీ రబ్బరు స్టాంపులతో నకిలీ హామీ పత్రాలను వీరినుంచి స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం కొయ్య కొట్టడానికి వచ్చే కూలీలకు ఈ 'బెయిల్' వ్యవహారం సులువుగా ఉండడంతో లోపలికి వెళ్లడం, బయటికి రావడం పట్ల భయం లేకుండా పోయింది.

కూలీలు శేషాచల అడవుల్లోకి ప్రవేశించే దారులు

* వేలూరు – గుడిపాల – చిత్తూరు – పూతలపట్టు – నేండ్రగుంట – చంద్రగిరి – తిరుపతి – తిరుమల అడవులు
* ఊతకోట – నగరి – పుత్తూరు – తిరుపతి – తిరుమల అడవులు
* చిత్తూరు – గంగధార నెల్లూరు – కొత్తపల్లి మిట్ట – వెదురు కుప్పం – చంద్రగిరి – తిరుపతి – తిరుమల అడవులు
* చెన్నై – తడ (సరిహద్దు) – సత్యవేడు – శ్రీకాళహస్తి – తిరుపతి – తిరుమల అడవులు
* బెంగుళూరు – అనంతపురం – రాయచోటి – సుండుపల్లె అడవులు
* చెన్నై – తిరుపతి – బాలపల్లె – మామండురు రైల్వే కోడూరు అటవీ ప్రాంతం పరిధి
* బెంగుళూరు – అనంతపురం – గుంతకల్లు – రైల్వే కోడూరు అటవీ ప్రాంతం పరిధి
* బెంగుళూరు – రాయచోటి – సుండుపల్లె అటవీ ప్రాంతం – తలకోన

ఓడరేవు మార్గాలు

* తిరుపతి – చిత్తూరు – రాణిపేట – వలజల పేట – రెడ్ హిల్స్ – చెన్నై ఓడరేవు
* పుత్తూరు – నగరి – తిరుత్తణి – తిరువళూరు – చెన్నై ఓడరేవు
* పీలేరు – మదనపల్లె – బెంగుళూరు – మంగుళూర్ ఓడరేవు
* చిత్తూరు – పలమనేరు – కోలార్ – బెంగుళూరు – మంగుళూర్ ఓడరేవు
* శ్రీకాళహస్తి – నెల్లూరు – నాయుడుపేట – తడ – చెన్నై ఓడరేవు
* శేషాచలం అడవులు – హైద్రాబాదు – మహారాష్ట్ర – గుజరాత్ కాండ్లా ఓడరేవు

* శేషాచలం అడవులు – హైద్రాబాదు – నాగపూర్ – గుజరాత్ కాండ్లో ఓడరేవు
* తిరుపతి – నెల్లూరు – విజయవాడ – విశాఖపట్నం ఓడరేవు

రవాణా మార్గాలు

* పీలేరు – సోదుం – సోమల – చౌడేపల్లి – పుంగనూరు – వడ్డేపల్లి – ముల్‌బాగల్ – కోలార్ – హవొస్పేట – కటికనహళ్ళి
* పీలేరు – కలికిరి – చింతపర్తి – సీటీఎం – మదనపల్లె – హోసూరు – కటికన హళ్ళి
* చిత్తూరు – కడప – కర్నూలు – మహబూబ్ నగర్ – హైద్రాబాదు – చత్తీస్‌ఘడ్ – మహారాష్ట్ర – ఢిల్లీ
* నాగపూర్ – ఆగ్రా – ఢిల్లీ – లక్నో – పాట్నా – ఝాన్సీ
* చెన్నై – విజయవాడ – విశాఖపట్నం – కోల్ కతా – బంగ్లాదేశ్
* చెన్నై – నాగ్‌పూర్ – రాయపూర్ – సిలిగురి (పశ్చిమ బెంగాల్)
* చెన్నై – కోల్‌కతా – గౌహతి – దిస్‌పూర్ (అస్సాం) – మోరే (మణిపూర్) – బంగ్లాదేశ్ – బర్మా

విదేశాలకు

* తిరుపతి – విశాఖపట్నం – ఒడిశా – పశ్చిమ బెంగాల్ – సిక్కిం – నేపాల్ – చైనా
* తిరుపతి – చెన్నై ఓడరేవు – ఇండోనేషియా – చైనా
* మంగుళూరు – ముంబై – కాండ్లో ఓడరేవుల నుంచి – ఒమెన్
* కోల్‌కతా – హల్దియా ఓడరేవులనుంచి – ఇండోనేషియా – చైనా
* తూతికూడి ఓడరేవు – కంబోడియా – చైనా

స్మగ్లింగు జరుగుతున్న విధానం


విదేశీ స్మగ్లర్
స్వదేశీ స్మగ్లర్
ఒకటో ఏజెంటు (పల్లెల్లోకి వెళ్లి కూలీలను ఎంపిక చేస్తాడు)
రెండో ఏజెంటు (స్థానిక ఏజెంటు) (కూలీలను అడవిలోకి తీసుకెళ్లడం, అడవిలో కొట్టాల్సిన చెట్లు చూపించడం)
మూడో ఏజెంటు (నరికి మోసుకొచ్చిన దుంగల్ని లెక్కించి తీసుకోవడం, కూలీ చెల్లించడం)
కూలీలు (చెట్లు నరకడం, మోసుకొని వాహనాల స్థావరంకు చేర్చడం)
డ్రైవర్లు (వాహనాల్ని సిద్ధంగా ఉంచుకొని అక్రమంగా తరలించడం)
నాల్గవ ఏజెంటు (ఓడ రేవులకు సమీపంలోని గోడౌన్లలో దాచడం, సరిహద్దులు దాటించడం)



కాచిగూడ – ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ ద్వారా చెన్నై పారిపోవడానికి 236 మంది తమిళ కూలీలు రైల్వే కోడూరు రైల్వేస్టేషన్ కు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రేణిగుంటలో అర్ధరాత్రిపూట అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సెల్ ఫోన్లు, గొడ్డళ్లు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. 2014 జూన్ 1వ తేదీ జరిగింది. దానికి మూడు రోజుల ముందు శేషాచలం అడవుల్లో కూలీలకు పోలీసులకు మధ్య ఘర్షణలో ముగ్గురు కూలీలు తూటాలకు బలైనారు. రేణిగుంటలో పట్టుకున్న 236 మంది కూలీలను తిరుచానూరులోని గోపాలకృష్ణ కల్యాణ మండపానికి తరలించాల్సి వచ్చింది.

2011 అక్టోబర్ 20వ తేదీన తమిళనాడులోని వేలూరు సమీపంలోని ఆరణి, అంబూరు, తిరువళ్లూరు తదితర ప్రాంతాలనుంచి వందమంది కూలీలు తమిళనాడు ఆర్టీసీ బస్సుల్లో తిరుపతికి తీసుకొస్తుండగా అటవీ అధికారులు అరెస్ట్ చేశారు. బస్సులో ప్రయాణికుల మాదిరిగానూ, తిరుమల కెళ్లే భక్తులుగానూ కొత్త కొత్త ఎత్తుగడలతో అరణ్యంలోకి ప్రవేశించే మార్గాలను స్మగ్లర్లు ఎప్పటికప్పుడు అన్వేషిస్తూ వచ్చారు.

2013 డిసెంబర్ 16వ తేదీ రైల్వేకోడూరు రైల్వేస్టేషన్లో తెల్లవారుజామున 48 మంది తమిళ కూలీలను అదుపులోకి తీసుకున్నారు. బస్సులో పారిపోతున్న మరికొందరు మామండూరు, కరకంబాడి ప్రాంతాల్లో చిక్కారు.

అటవీశాఖ డీఆర్వో శ్రీధర్, ఎఫ్ బీవో డేవిడ్ కరుణాకర్లను హత్యచేసిన ఘటనలో నిందితులను ఇరవైనాలుగు గంటల్లోనే పట్టుకోగలిగారు. వేలూరు జిల్లా కళ్లాపూర్ గ్రామానికి చెందిన గోవిందరాజులు, చవదన్ కాశి, నీళ్లనూరు గ్రామానికి చెందిన రామస్వామ్లర్లను అరెస్ట్ చేశారు. తిరుపతిలో శ్రీధరకు, రేణిగుంటలో డేవిడ్ కరుణాకర్ కు అంత్యక్రియల్ని వారి మత సంప్రదాయాల ప్రకారం పూర్తిచేశారు. తిరుపతిలో అటవీశాఖ ఉద్యోగులు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ ర్యాలీ నిర్వహించారు.

లంకమల అభయారణ్యంలో తమిళకూలీల కోసం అటవీ, ఏఆర్ పోలీసులు విస్తృత స్థాయిలో కూంబింగ్ చేశారు. చెన్నై నుంచి యాభైనుంచి అరవై మంది దాకా తమిళ కూలీలు అడవిలోకి ప్రవేశించారని తెలుసుకున్న వీరు 2013 ఏప్రిల్ 1 నాడు అడవిబాట పట్టారు. చిత్తూరు జిల్లాలోని పులిబోను ప్రాంతంలో భారీ ఎత్తున ఎర్రచందనం తరలిస్తున్న స్మగ్లర్లను ఇరవైరెండు మందిని అరెస్ట్ చేశారు. 2013 సంఎం మొదటి ఆరు నెలల్లో తిరుపతి పరిధిలో 27 ఎర్రచందనం కేసుల్ని కట్టి 426 మంది నిందితుల్ని 25 టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

రాజంపేట అటవీ డివిజన్ పరిధిలో కోనలబావి ప్రాంతంలో ఎర్రచందనం దుంగల్ని మోస్తున్న పదమూడు మంది కూలీల్ని పట్టుకున్నారు. ముప్పై ఎర్రచందనం దుంగలు స్వాధీనమయ్యాయి. పొలాల్లో ఎర్రచందనం దుంగల్ని నిల్వ ఉంచుతున్న సమాచారం బయటపడింది. తమిళ కూలీలను తీసుకొచ్చి, స్థానికంగా వాళ్లందరికి దారులు చూపిస్తున్న చింతరాజుపల్లికి చెందిన బుక్కే నాగేశ్వర నాయక్, సరస్వతీ పురంకు చెందిన పి. రహమాన్, సంబేపల్లికి చెందిన కె. రామాంజనేయులు, కె.వెంకట రమణ, డి. కుమార్, సి. వెంకటేశు, రామాపురంకు చెందిన ఆర్.సుబ్బయ్య, డి. నగేష్, టి. బాబు, నడింపల్లికి చెందిన రెడ్డి నాయక్, లక్కిరెడ్డిపల్లెకు చెందిన పి.రామాంజనేయులు, పి. సురేంద్ర, డి. శివకుమార్లను 2013 డిసెంబర్ 17వ తేదీ నాడు అదుపులోకి తీసుకున్నారు. అదే రోజే సుండుపల్లి-రాయవరం దారిలోని

బైరాగిగుట్ట సమీపంలో 22 మంది తమిళ కూలీలు చిక్కారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన వేలూరు, తిరుపణ్ణామలై జిల్లాలకు చెందిన కుప్పన్, శంకర్, అరుణాచలం, సౌందర్, వెంకటేశన్, గోవిందస్వామి, మహేంద్రన్, గోవిందరాజు, సెల్వం, సుందర్, తిరుపతి, మురళి, హరిశ్చంద్ర, చిన్నాండి, సెల్వం, తీర్థగిరి, సందీప్ కుమార్, లక్ష్మణ్, బాలక్రిష్ణ, మహేంద్రన్ ఈ జాబితాలో చేరారు.

సానిపాయ రేంజి వానరాచపల్లె బీట్లో మురుగుమడుగు సమీపంలో ఆరు మంది తమిళ కూలీలు – పి. నారాజు, రాజ్ కమల్ నాథ్, రామస్వామి సత్యరాజ్, ముత్తు రామచంద్రం, దొరైస్వామి ప్రకాష్, ఎం. గోవిందరాజ్ లను అదుపులోకి తీసుకొని పన్నెండు ఎర్రచందనం కొయ్యల్ని స్వాధీనం చేసుకున్నారు.

2013 డిసెంబర్ 28 నాడు కూడా సానిపాయరేంజ్ పరిధిలోని పాండవుల గుహలవద్ద తమిళ కూలీలు – అటవీ అధికారులపై రాళ్లదాడికి పాల్పడ్డారు. ఇదే సందర్భంలో యాభైమంది తమిళ కూలీలను డీఎస్పీ అదుపులోకి తీసుకొని కోర్టుకు హాజరుపర్చారు. అదే సంవత్సరం డిసెంబర్ 19 నాడు బాలపల్లె రేంజ్ లోని బీట్లో పట్టుబడిన ఏడుమంది తమిళ కూలీలను దిగంబరులుగా చేసి కర్రలతో అటవీ సిబ్బంది కొడ్తున్న దృశ్యాలను వీడియో తీసి మీడియాకివ్వడం ఒక సంచలనం. తాడుతో కాళ్లూ, చేతులు కట్టేసి తమిళ కూలీలను హేయంగా చిత్రహింసలు పెడ్తున్న వీడియో తర్వాత ఇంటర్ నెట్లోకి ఎక్కింది.

2014 జనవరిలో బ్రహ్మంగారిమఠం ఎడమకాల్వ దగ్గర తరలించడానికి సిద్ధంగా ఉన్న 350 ఎర్రచందనం దుంగల్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇటుకులపాడు – బాలాయపల్లె అటవీ ప్రాంతం నుంచి 139 దుంగల్ని పట్టుకున్నారు. రాజంపేట డివిజన్ కేంద్రంగా ఎర్రచందనాన్ని కొల్లగొడుతున్న 300 మంది ఎర్రచందనం స్మగ్లర్లను గుర్తించగలిగామని డీఎస్పీ ప్రకటించారు. కడప, రాజంపేట, ప్రొద్దుటూరు అటవీ డివిజన్ల పరిధిలోని అటవీ సిబ్బందికి 65 కొత్త ఆయుధాలను అప్పటి కడప కలెక్టర్ కోన శశిధర్ అందజేశారు.

ఎర్రచందనం దుంగలను పొలతల అటవీ ప్రాంతంలో నరికి అనంతపురం మీదుగా బెంగుళూరుకు తరలించాలనే వ్యూహంతో వెళ్తున్న 42 మంది తమిళ

కూలీలను 2014 జూలై 10వ తేదీన కడప – తాడిపత్రి జాతీయ రహదారిపై తనఖీ చేస్తున్న వల్లూరు పోలీసులు పట్టుకోగలిగారు.

ప్రొద్దుటూరు బైపాసు రోడ్డులోని కొత్తపల్లి చెక్ పోస్టు వద్ద ఎర్రచందనాన్ని తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. బెంగుళూరుకు తరలిపోతున్న 64 ఎర్రచందనం దుంగల్ని స్వాధీనం చేసుకున్నారు. పుల్లంపేట మండలం వత్తలూరు అటవీ ప్రాంతంలోనూ ఏడుగురు తమిళ కూలీలు, నాలుగు దుంగల్ని 2014 ఆగస్టు 2 నాడు పోలీసులు పట్టుకోగలిగారు.

ఒంటిమిట్ట మండలం పరిధిలోని మంటపంపల్లె అటవీ ప్రాంతంలో ఎనిమిది మంది తమిళ కూలీలు – అనిముత్తు, చిన్నస్వామి, కరేరామన్, ఆండీ, క ృష్ణన్, నటరాజ్, రవి, రాజాలను 11 ఎర్రచందనం దుంగల్ని పట్టుకున్నారు. 2014 ఆగస్టు 2వ తేదీనాడు స్వాధీనం చేసుకున్నారు.

బాలపల్లె అటవీ ప్రాంతంలోని కంగుమడుగు ప్రాంతంలో 15 ఎర్రచందనం దుంగలు లభించాయి. ఈ దాడిలో తమిళనాడు వేలూరు జిల్లాకు చెందిన 9 మంది కూలీలు – మాదేశ్వరన్, గాంధీ, సెంధిరన్, ఉపేంద్రన్, సెల్వం, అన్నామలై, పాండియన్, నాగేంద్రన్, కణ్ణన్ సుధాకర్లను 2014 సెప్టెంబర్ 9వ తేదీ అదుపు లోకి తీసుకున్నారు. బాలపల్లె వెస్ట్ బీట్ ప్రాంతంలో 90 ఎర్రచందనం దుంగల్ని, దేశెట్టి పల్లె బీట్ తునుగొండ ప్రాంతంలో 12 కొయ్యలు, పులిగుంత ప్రాంతంలో మూడు దుంగల్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నడింపల్లె బీటు నూరు గుండ్రాళ్ల కోనవద్ద ఏడు దుంగల్ని, రోళ్లమడుగు ప్రాంతంలో 9 మంది తమిళ కూలీలను పట్టుకొని రిమాండ్ కు పంపగా బెయిల్ పై విడుదల అయ్యారు. చిన్నమండెం వద్ద ఆర్టీసీ అద్దె బస్సులో వస్తున్న 34 మంది తమిళ కూలీలను, వారి వద్ద ఉన్న 14 దుంగలను 2015 ఫిబ్రవరి 12వ తేదీన అదుపులోకి తీసుకున్నారు పులివెందుల ఏఎస్పీ అన్బురాజన్..

బాలపల్లి అటవీ ప్రాంతంలో సాయుధ బలగాలతో జరిపిన దాడిలో తమిళ కూలీలు పదమూడు మంది – కోవిందన్, కోలవాన్, వెంకటేశన్, ఆండీ, పళనీస్వామి, చిన్నదురై, కోవిందరాజన్, తంగరాజు, నటరాజన్, గుచ్చోశర్మ, ఆండీకుమార్,

కుమార్, కొలదివేల్ పట్టుబడ్డారు. వారి నుంచి 14 కొయ్యలను 2015 ఫిబ్రవరి 28వ తేదీన స్వాధీనం చేసుకున్నారు.

2007 ప్రాంతానికే పదివేల టన్నుల ఎర్రచందనం దుంగలు అటవీశాఖ వారి గోడౌన్లలో పడి మగ్గాయి. ప్రభుత్వం అనుకున్న ధర టన్నుకు రూ. 1.50 లక్షలు. నిజానికి అంతర్జాతీయ మార్కెట్లో టన్నుకు రూ. 2.50 లక్షలు పలకవచ్చు. ఈ విధంగా గోదాములో రూ. 150 కోట్ల సరకు మూలకు పడింది. స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న దుంగలను కడప, తిరుపతి, వెంకటగిరి, రాజంపేట, భాకరాపేట గోడౌన్లలో భద్రపరుస్తూ వచ్చారు. ఐదు గోదాముల్లోని పదివేల టన్నుల ఎర్రచందనాన్ని స్మగ్లర్ల బారినుంచి, అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకుంటూ వచ్చారు. ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో 1550 టన్నులు, రాజంపేటలో 800 టన్నులు, కడపలో 500 టన్నులు నిల్వ ఉంచారు. అప్పటి అటవీ శాఖామంత్రి పి.రామచంద్రా రెడ్డి, కేంద్ర పర్యావరణ శాఖమంత్రి జైరాం రమేషను కలిసి 'నాలుగు సంవత్సరాలు'గా టెండర్ల ప్రక్రియ ఆగిపోయిన విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లారు. మూడు సంవత్సరాల క్రితం గ్లోబల్ టెండర్లను పిలిచినప్పుడు రెండు కంపెనీలు టన్నుకు కేవలం రూ. 1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల ధరకు టెండర్లు వేశాయి. ఇది తక్కువ ధరగా ఉందని మంత్రి రామచంద్రారెడ్డి వ్యతిరేకించడంతో టెండర్ వేసిన రెండు సంస్థలు కోర్టు కెక్కాయి. అనంతరం మంత్రి వర్గం నుంచి వారు తప్పుకోవడంతో ఇరువర్గాలు పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. సి గ్రేడ్ ఎర్ర చందనాన్ని టన్నుకు రూ. 2.57 లక్షలకు, నాన్ గ్రేడ్ ను రూ. 2.2 లక్షలకు విక్రయించేందుకు అధికారులు ఆమోదం తెలిపారు.

రెండు కంపెనీలకు 625 టన్నుల సీ గ్రేడ్ రకాన్ని, 1152 మెట్రిక్ టన్నుల నాన్ గ్రేడ్ రకాన్ని కేటాయిస్తూ 2011 మార్చి 17 నాడు అటవీ శాఖ ఆదేశాలు జారీచేసింది. జీవో నెంబర్లు 81, 82 కింద మెసర్స్ జిటాన్ ట్రేడింగ్ కార్పోరేషన్, మెసర్స్ ఆంధ్రా పొగాకు ప్రైవేటు లిమిటెడ్ కు ఇవి దక్కాయి. సింగపూర్ కు చెందిన మెసర్స్ పవర్ రిసోర్సు ప్రైవేటు లిమిటెడ్ కూడా దుంగలు విక్రయించాలని నిర్ణయించి ముగ్గురికీ 1602.816 టన్నులు విక్రయించారు.

ఎర్ర చందనం కొయ్యల అమ్మకంపై విచారణ జరిపించాలని మాజీ మంత్రి, అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే డా॥ పి. శంకరరావు హైకోర్టులో 2012 మార్చి 22 నాడు ప్రజాహిత వాజ్యం దాఖలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి, అటవీశాఖ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జానకి కొండపి, ప్రధాన కార్యదర్శి, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, కేంద్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి, వాణిజ్య ఎగుమతుల శాఖ ముఖ్య కార్యదర్శి, సీబీఐ డైరక్టర్తో పాటూ జిటాన్ ట్రేడింగ్ కంపెనీ భాగస్వామి టి. రాకేశ్ రెడ్డి, ఆంధ్ర పొగాకు ప్రయివేట్ లిమిటెడ్ ఎండీ పి.వి. శశిధర్, సింగపూర్కు చెందిన పవర్ గ్రిప్ రిసోర్సెస్ సంస్థను ప్రతివాదులుగా చేర్చారు.

విదేశీ వ్యవహారాలశాఖ మొదట మూడు వేల టన్నుల ఎర్రచందనం విక్రయాలకే ప్రతిపాదనలు చేయగా వాణిజ్య మంత్రిత్వ శాఖ 8,584 టన్నుల అమ్మకానికి అనుమతి ఇవ్వడంపై ఢిల్లీ హైకోర్టులోనూ, చెన్నలోని గ్రీన్ ట్రిబునల్లోనూ వ్యాజ్యాలు వేశారు. 'ఈ-వేలం' ద్వారా తొలి దశలో విక్రయాలు జరిపేవారు టెండరు విలువలో 10 శాతం చెల్లించాల్సి ఉంటుంది. టెండరులో పాల్గొనాలంటే 20-25 కోట్లు ధరావత్తుగా చెల్లించవలసి ఉండడంతో పాటూ బ్యాంకు గ్యారెంటీగా మరో 25 కోట్లు చూపించాల్సి ఉంటుంది. 2013 అక్టోబర్ 24వ తేదీ 180 రోజుల్లో వేలం ప్రక్రియ పూర్తిచేసి 180 రోజుల్లో విక్రయించిన ఎర్రచందనాన్ని ఎగుమతి ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కేంద్రం అనుమతించింది. టెండర్ల ప్రక్రియ కోసం కమిటీని వేసుకున్నారు. ఇచ్చిన గడవు ముగుస్తుండడంతో గడువు పొడిగింపును కోరుతూ కేంద్రానికి లేఖ రాశారు. ఇంతలో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కొత్తగా మళ్లీ గడవుకు అనుమతి లభించింది.

కేంద్రం నుంచి 8584 టన్నుల ఎర్రచందనాన్ని విక్రయించుకునేందుకు అనుమతి లభించింది. తొలి విడతగా 4160 టన్నులను విక్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసుకుంటూ 2014 నవంబరు 24వ తేది గ్లోబల్ టెండర్లకు పిలుపు నిచ్చింది. టెండర్ల ద్వారా విక్రయించే బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సంస్థ

NSTC లిమిటెడ్ కు అప్పగించారు. తిరుపతి డిపోలో 30 లాట్లు, నెల్లూరు జిల్లా ఆదూరిపల్లిలో 30 లాట్లు, ఉదయగిరి, వెంకటగిరి, కనిగిరిల్లోని 33 లాట్లు, కడపలోని బి57 లాట్లు, భాకరాపేటలోని 27 లాట్లను వేలానికి పెట్టారు. 'ఏ' గ్రేడ్ రకానికి టన్ను ఒక్కంటికీ 12 లక్షలు, 'బి' గ్రేడ్ రకానికి 10 లక్షలు, 'సి' గ్రేడ్ రకానికి 8 లక్షలుగా ధరలను నిర్ణయించారు. వేలంలో 'ఏ' గ్రేడ్ కలప 4.7 టన్నులు, 'బి' గ్రేడ్ కలప 166.19 టన్నులు, 'సి' గ్రేడ్ కలప 3988.8 టన్నులు అమ్మకానికి కేటాయించారు. వేలంలో పాల్గొనాలనుకునే బిడ్డర్లు ఈటెండర్ల'ను నిర్వహిస్తున్న MSTC వెబ్ సైట్ www.msticecommerce.com ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించింది.

వేలంలో భారతీయ, విదేశీ సంస్థలు పోటీపడ్డాయి. 117 లాట్లలోని ఎర్రచందనం దుంగలకోసం దుబాయ్, చైనా, హాంకాంగ్ సంస్థలతో పాటూ మూడు భారతీయ సంస్థలు కూడా పాల్గొన్నాయి. టన్ను రూ. 1.95 కోట్లు ధర పలికిన 'ఏ' గ్రేడ్ ఎర్రచందనాన్ని బాబా రాందేవ్ కి చెందిన 'పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్' దక్కించుకుంది. ఇందులో 706 టన్నులకు రూ. 200 కోట్లు కోట్ చేసిన పతంజలి సంస్థ రూ. 50 కోట్లు డిపాజిట్గా చెల్లించింది. పుడానీ, సీఎంఆర్ సంస్థలతో పాటూ దుబాయ్తి చెందిన డైమండ్ స్టార్ కూడా అధిక మొత్తంలో ఎర్రచందనం కొనుగోలుకు సిద్ధపడింది. డైమండ్ స్టార్ 570 టన్నుల కోసం ఇంకా రూ.300 కోట్లు చెల్లించాల్సి ఉండగా మరో మూడు నెలల సమయాన్ని కోరింది.

రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత ఎర్రచందనాన్ని విక్రయించడానికి సన్నద్ధమైంది. 3,500 టన్నుల ఎర్రచందనం దుంగలను 'ఈటెండర్-ఈ వేలం' ద్వారా విక్రయిస్తూ, MSTCకి బాధ్యతలు అప్పగిస్తూ 2015 మే 6వ తేదీన అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ.కె. పరీడా ఉత్తర్వులు జారీచేశారు. ఏర్పాట్లను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (APFDC) చేపడుతుంది. అందుకు వారికి రెండు శాతం కమీషన్ చెల్లిస్తారు. టెండర్ కమిటీ సూచించినట్లు ప్రారంభ ధరలు 'ఏ' శ్రేణికి 30 లక్షలు, 'బి' శ్రేణికి 20 లక్షలు, 'సి' శ్రేణికి 12 లక్షలు నిర్ణయించారు. ఎర్రచందనం దుంగల ఎగుమతి విధానాలకు 2016 ఏప్రిల్ నెలాఖరును గడవుగా కేంద్రం విధించింది.

ఎర్రచందనం
శాస్త్రీయ వర్గీకరణ

రాజ్యం	–	ప్లాంటే
విభాగం	–	మాగ్నోలియో ఫైటా
తరగతి	–	మాగ్నోలియోప్సిడా
క్రమం	–	Fabales
కుటుంబం	–	ఫాబేసి
ఉప కుటుంబం	–	Faboideae
జాతి	–	Dalbergieae
	–	టీరో కార్పస్
ప్రజాతి	–	P. Santalinus
ద్వినామీకరణం	–	Pterocarpus Santalinus
స్థానిక పేర్లు	–	ఎర్రచందనం
		రక్తచందనం

ఎర్రచందనానికి అంతర్జాతీయ మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉండడానికి కారణం ఏమిటి? చైనా, జపాన్, సింగపూర్ వంటి దేశాలు పెద్ద ఎత్తున ఎర్రచందనం దుంగలను కొనుగోలు చేయడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమై ఉంటుంది? కొన్ని దేశాల్లో వాద్య పరికరాల తయారి కోసమని, ఫర్నీచర్ కోసమని చెప్తున్నది నిజమేనా? కొన్ని రకాల ఔషధాల తయారీ కోసమని చెప్పడం వాస్తవమేనా? వీటన్నిటి పై ఉన్న సందేహాలకు సమాధానాలు వెతకడం కోసం IICTని నివేదిక కోరింది రాష్ట్ర ప్రభుత్వం.

యోగా గురు రామ్‌దేవ్ బాబాకు చెందిన 'పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్' సంస్థ 700 టన్నులకు రెండువందల కోట్లు చెల్లించడానికి ముందుకొచ్చిన నేపథ్యంలో ఎర్రచందనాన్ని ఔషధాల్లో వాడనున్నారనే ఒక కోణం మాత్రం గుర్తించగలిగారు. లైంగిక సామర్థ్యాన్ని పెంచే ఔషధాల్లో దీన్ని వాడుతున్నారనీ ప్రచారం కూడా ఉంది. పట్టుబడిన చైనా స్మగ్లర్ యాంగ్ పెంగ్ - ఎర్రచందనాన్ని పవిత్రమైన పూజా సామాగ్రి కోసం, మెడలో పవిత్రంగా ధరించే దండలుగా (మనవాళ్లు రుద్రాక్షలు ధరించినట్లు) వాడుతున్నారని వెల్లడించాడు. ఇంకోవైపు నుంచి ఆలోచిస్తే - ఇందులోని సీసం, తోరియం, జింక్, స్టాన్నియం, బేరియం, నికెల్, వెనెడియం, కాడ్మియం ఖనిజాలు ఇందులో కల్గి ఉండడం, అణువిద్యుత్ కేంద్రాల్లో ప్రత్యేక సందర్భాల్లో క్యాడ్మియం

క్యాండిల్స్ బదులు ఎర్రచందనం దుంగల్ని వినియోగించే అవకాశం ఉందని చెప్తున్నారు.

ఎర్రచందనంలో కార్బన్ (కర్బనం) 25 శాతం, హైడ్రోజన్ (ఉదజని) 5 శాతం, సల్ఫర్ (గంధకం) 7.5 శాతం ఉన్నట్లు శాస్త్రవేత్తలు వర్గీకరించారు. అతినీల లోహిత, పరారుణ కిరణాలను కూడా నిరోధించే గుణాలు దీనికి ఉన్నాయంటారు. నేల స్వభావం వల్ల రాయలసీమ జిల్లాల్లో ప్రధానంగా చిత్తూరు, కడప జిల్లాల్లో కాల్షియం కార్బొనేట్ నేలలు ఎక్కువ కావడం వల్ల ఈ ప్రాంతంలో పండే ఎర్రచందనం మొదటి శ్రేణికి చెందినదిగా గుర్తిస్తున్నారు. ఈ ప్రాంతాల్లోని నేలసారం, స్థానిక వాతావరణం వల్ల కూడా ఇది సాధ్యమౌతోందని తెలుస్తోంది. ఎర్రచందనం వృక్షం ఆకులు, కొమ్మలు, బెరడు, వేర్లు ప్రతి భాగం ఔషధ గుణాలు కల్గివుందని శాస్త్రవేత్తలు వెల్లడిస్తున్నారు. ఎండ నుంచి రక్షణకోసం, రంగుకోసం తయారుచేసే క్రీముల్లోనూ ఇది ఉపయోగపడుతోందని తేలింది.

అత్యంత వేగంగా అంతరించిపోతున్న అరుదైన వృక్షాల జాబితాలో ఉంది – ఎర్రచందనం. ముందుగా దీన్ని ఆ జాబితాలో నుంచి తొలగింపచేయడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లో వేలం వేసుకోవడానికి ఉన్న ఆంక్షలు చాలా వరకు తొలగి పోతాయి. ఎర్రచందనం కొయ్యల్ని విక్రయించుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధానంగా 'కన్వెషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎన్డేంజర్డ్ స్పీసెస్ ఆఫ్ వైల్డ్ ఫ్యూనా అండ్ ఫ్లోరా (సైటిస్) అనుమతి తప్పనిసరి. అలాగే కేంద్ర విదేశీ వాణిజ్య శాఖ నుంచి కూడా అనుమతి అవసరం అవుతోంది. పలు రకాలైన ఆంక్షలు, కాల పరిమితులతో ఈ రెండు శాఖలు అనుమతులను మంజూరు చేస్తున్నాయి. అవి ఇచ్చే గడవుల్లోగానే విక్రయాలు చేసుకోవాల్సి ఉంటుంది. గోడౌన్లలో మగ్గుతున్న సుమారు తొమ్మిది వేల టన్నుల ఎర్రచందనం నిల్వలను అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించడానికి 2012లో అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. ఎర్రచందనం అరుదైనదిగా, అంతరించిపోతున్న జాతిగా 'సైటిస్' ప్రకటించడంతో విక్రయాలు ఆగిపోతూ వస్తున్నాయి.

అంతరించిపోతున్న అరుదైన వృక్షాల జాబితాలోంచి ముందు ఎర్రచందనాన్ని తొలగింప చేసుకోవడం పైన రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా మిగిలినచోట్ల కూడా ఈ మొక్కల్ని పెంచుకునే అవకాశం ఉందని చెప్పడం, తమిళనాడు, కర్నాటక అడవుల్లో కూడా ఎర్రచందనం చెట్లు ఉన్నాయని చెప్పడం ద్వారా చెట్టు ప్రాధాన్యతను తగ్గించాలని భావిస్తున్నారు. అదే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తూ 2015 ఏప్రిల్లో ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు లేఖ కూడా రాసింది.

అంతకుముందు 2011 ప్రాంతంలో వాస్తవంగానే ఎర్రచందనం వృక్షాలు అరుదైనవా? కావా? అంతరించిపోయే దశలో ఉన్నాయా? లేవా? వంటి ప్రశ్నలన్నిటికి సమాధానాల్ని కనుక్కోవడం కోసం కోయంబత్తూరుకు చెందిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ జెనెటిక్స్ అండ్ టీ బ్రీడింగ్ (IFGTB) సంస్థకు తన నివేదిక అందజేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం పని అప్పగించింది. ఆ సంస్థకు సంబంధించిన శాస్త్రవేత్తలు నాలుగు నెలలపాటూ చిత్తూరు, కడప, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో విస్తృతంగా ఎర్రచందనం వృక్షాలపై అధ్యయనం చేశారు.

2011 డిసెంబర్లో తమ నివేదికను తయారుచేశారు. దీనిని 'సైటిస్'కు అందజేశారు. దీనివల్ల అంతర్జాతీయ వేలం నిర్వహించుకోవడానికి మార్గాన్ని ఏర్పరచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఫలితంగా కొంత సానుకూలంగా వేలం వేసుకోవడం సాధ్యమైంది.

అత్యంత ఖరీదైన ఎర్రచందనం వల్ల అసలు ప్రయోజనం ఏమిటి? దీని రసాయనిక లక్షణం ఏమిటి? అనే అంశాల్ని గూర్చి వివరంగా తెలుసుకోవడం కోసం భారత రసాయన సాంకేతిక సంస్థ (IICT)కి 2015 జనవరిలో బాధ్యత అప్పగించారు. ఎర్రచందనం వృక్షాలయొక్క ఆకులు, కొమ్మలు, బెరడు, వేర్లు అందులో నిక్షిప్తమైన అంశాల గురించిన పరిశోధనకు IICTసిద్ధపడింది.

ఆంధ్రప్రదేశ్ అడవుల్లో ఏఏ ప్రాంతాల్లో, ఏఏ ప్రదేశాల్లో, ఏఏ డివిజన్లలో ఎంత శాతం ఎర్రచందనం వృక్షాలు ఉన్నాయని కనుక్కోవడానికి రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (NRSA) ఉపగ్రహ పరిజ్ఞానం కూడా అవసరమైంది. ఎర్రచందనం ఉన్న

అడవుల్లోకి ఎవరైనా ప్రవేశించిన వెంటనే GPRS ద్వారా సంబంధిత అధికారులకు సంకేతాలు వెళ్లేలా నెట్వర్క్ కూడా తప్పనిసరిగా మారింది.

ఇరవై అయిదు రకాల ఎర్రచందనం జాతుల్లో 'ఏ' గ్రేడ్ హార్డ్వుడ్ను అందించే మొక్కల పెంపకం కోసం తిరుపతి అక్కారం పల్లె వద్ద అటవీశాఖ 'బయోట్రిమ్' కార్యాలయాన్ని 2014 ఆగస్టు 10 నుంచి ప్రారంభించింది. ఇక్కడ అభివృద్ధి పరచబడిన ఎర్రచందనం మొక్కల్ని 'ల్యాబ్ టు ల్యాండ్' ప్రాతిపదికగా అడవుల్లో పెంచడం ఈ ప్రోగ్రాం ప్రధాన ఉద్దేశ్యం.

అడవుల్లో ఎర్రచందనం వృక్షాలను స్మగ్లర్లు పాతికేళ్లకే నరికేస్తు ఉండడం వల్ల సహజ సిద్ధమైన పునరుత్పత్తి దెబ్బ తింటోందని IFGTB స్పష్టపర్చింది. అలాగే స్మగర్ల దాడులు, అడవికి నిప్పువంటి కారణాలవల్ల ఎర్రచందనం సహజ సిద్ధమైన ఉత్పత్తి తగ్గిపోయి అంతరించిపోయే ప్రమాదం ఉందని కూడా తన నివేదికలో తెలియజేసింది.

ఎర్రచందనం వృక్షాలు దృఢమైన కొయ్యగా రూపాంతరం చెందాలంటే కనీసం 75 సంవత్సరాల నుంచి 100 సం॥రాలు పడుతుంది. కానీ స్మగ్లర్లు చిన్న చిన్న చెట్లు కూడా కొట్టిపారేస్తున్నారు. ఇదే నేపథ్యంలో వీటిని కూడా టేకు చెట్లులా పెంచుకోవడానికి వీలుగా IFGTB శాస్త్రవేత్తలు నూతన ఎర్రచందనం మొక్కల్ని అభివృద్ధిపర్చారు. శేషాచలం నుంచి సేకరించిన విత్తనాలపై ప్రయోగాలుచేసి కొత్త మొక్కలను సృష్టించారు.

చెట్ల వయస్సు, రంగు, చుట్టుకొలత తదితర అంశాల ఆధారంగా సుపీరియర్ విత్తనాలు సేకరించి ఈ ప్రయోగాలు చేశారు. 25 నుంచి 35 ఏళ్ల లోపులోనే పూర్తిస్థాయి చెట్లుగా ఇవి మారతాయి. 10 నుంచి 15 ఏళ్లలోపే విత్తనాలు ఇస్తాయి. ఈ కొత్త ఎర్రచందనం మొక్కలు ఎలాంటి నేల, వాతావరణంలోనైనా పెరుగుతాయి. రైతులు వాణిజ్య పంటగా కూడా వీటిని సాగుచేసుకోవచ్చని IFGTB చెప్తోంది.

ఇప్పటికే చాలా ప్రాంతాల్లో సాధారణంగా అటవీశాఖ వారి నర్సరీల నుంచి సేకరించుకున్న ఎర్రచందనాన్ని రైతులు సాగుచేసుకుంటున్నారు. అయితే శేషాచలం, లంకమల, నల్లమల ప్రాంతాల్లో సహజసిద్ధంగా పెరిగిన చెట్లలో ఉన్న నాణ్యత

పొలాల్లో పెంచిన ఎర్రచందనం కొయ్యల్లో ఉండడం లేదని రైతులు తేల్చి చెబుతున్నారు. చెట్లను ఎంత కష్టపడి పెంచినా నరికిన తర్వాత కొయ్యదుంగ మధ్య భాగంలో తెల్లటి భాగం కన్పిస్తే రేటు ఉండదనేది రైతుల ఆందోళన.

ఇప్పటికే కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లోనే కాక రాష్ట్రంలో మిగిలిన చోట్ల కూడా రైతులు తమ పొలాల్లో ఎర్రచందనం పెంచుతున్నారు. ఉపాధి హామీ పథకం కింద పొలాల గట్లపై ఎర్రచందనం మొక్కలు నాటారు. నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. కడప, చిత్తూరు జిల్లాల్లో వర్షాలు కురిసి రైతులు విత్తనం వేసుకున్నాక పొలం గట్లపై మొక్కల్ని నాటుకుంటున్నారు. మొక్క తీసుకునే దగ్గర్నుంచి నాటిన తర్వాత సంరక్షణ ఖర్చు కూడా వీటికి ప్రభుత్వమే భరిస్తోంది. కడప జిల్లాలో రైల్వే కోడూరు, చిట్వేలి, రాజంపేట, రాజీవ్ స్మృతివనం (కడప) ప్రాంతాల్లో లక్ష మొక్కల లెక్కన నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నారు. రాజంపేట అటవీ డివిజన్ పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, చిట్వేలి, సానిపాయ రేంజ్లో వంద హెక్టార్లలో ఎర్రచందనం మొక్కలు పెంచుతున్నారు. అడవుల్లో సేకరించిన ఎర్రచందనం విత్తనాల ద్వారా ఈ మొక్కల్ని తయారుచేస్తున్నారు.

స్వంత భూముల్లో ఎర్రచందనం పెంచే రైతులు మొక్కల్ని పెంచినప్పటికీ వాటిని కనీసం 25 ఏళ్ల పాటైనా సంరక్షించవలసి ఉంటుంది. వృక్షంగా మారిన వాటిని నరికించాల్సి వచ్చినప్పుడు పొలం యజమాని కలెక్టర్ నుంచి ధ్రువీకరణ పొందవలసి ఉంటుంది.

కలెక్టర్ లేఖతో పాటూ తన పొలంలో సాగుచేస్తున్న ఎర్రచందనం వృక్షాల సమాచారంతో జిల్లా అటవీశాఖ అధికారులను తనఖీకోసం కోరవలసి ఉంటుంది. చెట్లు వయస్సు, లావు, పొడవు వంటి అంశాల్ని అధికార్లు పరిశీలిస్తారు. అంచనా సక్రమంగా ఉంటే పర్మిషన్ లభిస్తుంది. నరికిన దుంగల కొలతలను కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారులు తీసుకుంటారు. విక్రయాలు, కొనుగోలు చేస్తున్న వారి వివరాల్ని పూర్తిగా రాష్ట్రస్థాయి అదనపు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి పర్యవేక్షణలో సాగాల్సి ఉంటుంది. వారి అనుమతి తప్పని సరి.

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న హస్తకళాకారులనుంచి ఎర్రచందనం కొయ్యకోసం డిమాండ్ పెరుతోంది. కానీ వారికి అందుబాటులో ఉండడం లేదు. హర్యానా, ఉత్తరప్రదేశ్ కు చెందిన హస్తకళ వస్తువుల తయారీ, ఫర్నీచర్ సంస్థలు ఎర్రచందనం కొయ్యలను కోరుతున్నాయి. కడప జిల్లాలోని రైల్వేకోడూరు నియోజక వర్గ పరిధిలోని శెట్టిగుంట, లక్ష్మీపురం గ్రామాల్లో దాదాపు 35 కుటుంబాల కళాకారులు 'కొయ్య బొమ్మల తయారీలో పేరుపొందారు. 2013లో లేపాక్షి సంస్థ ముందుకొచ్చి ఈ కళాకారులకు 20 టన్నుల ఎర్రచందనం కొయ్య బొమ్మల కోసం అటవీశాఖనుంచి ఇప్పించడానికి ప్రయత్నాలు చేసింది. గతంలో పలుసార్లు అటవీ అధికారుల దాడుల్ని కళాకారులు ఎదుర్కోవలసి వచ్చింది. ఎర్రచందనం కొయ్యకు ప్రత్యామ్నాయంగా గుమ్మడిటేకుతో బొమ్మలు తయారుచేసుకుంటున్నారు. వారం నుంచి ఇరవై రోజుల వరకు ఒక బొమ్మకోసం కష్టపడాల్సి ఉంటుంది. 2003లో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ కు వీళ్లు తయారుచేసిన ఎర్రచందనం చెక్కబొమ్మను రాష్ట్ర ప్రభుత్వం బహూకరించింది. అలా శెట్టిగుంట కొయ్య బొమ్మ వైట్ హౌసకు కూడా చేరింది. ముప్పై సంవత్సరాల క్రితం వెంకటయ్య అనే వ్యక్తి ముందుగా ఇక్కడ చెక్కబొమ్మల తయారీని మొదలు పెట్టాడు. ఒక్కొక్క బొమ్మ ఐదువేల రూపాయలనుంచి యాభైవేల వరకు అమ్ముకునే వారు. బొమ్మల తయారీకి ఎప్పుడైనా ఒకటి, రెండు కొయ్యలు తీసుకపోయినా వీళ్లను కూడా స్మగ్లర్లుగా అధికార్లు చూస్తూవుండడంతో మానేయాల్సి వచ్చింది.

2008లో ప్రపంచ బ్యాంకు నిధులతో ఇరవైఅయిదు లక్షలు వెచ్చించి రైల్వే కోడూరులో యాభై ఎకరాల్లో ఎర్రచందనం' పార్కును ఏర్పాటు చేశారు. ఎత్తుగా పెరిగిన ఎర్రచందనం వృక్షాల్ని రాష్ట్ర అటవీశాఖ అకాడమీ నుంచి వచ్చే విద్యార్థులు చూసిపోయేవారు. తర్వాత అభివృద్ధికి నోచుకోకుండా పోయింది.

అత్యంత విలువైన ఎర్రచందనాన్ని భద్రపరిచేందుకు అవసరమైన గోడౌన్లను తిరుపతిలో 'స్టేట్ ఆఫ్ ఆర్ట్ గోడౌన్' పేరుతో నిర్మించాలని నిర్ణయించారు. ఒకే ప్రాంగణంలో నిర్మించే ఆరు గోడౌన్లలో ఎనిమిది మెట్రిక్ టన్నుల కొయ్యదుంగలను భద్రపరిచే వీలుంటుంది. గోడౌన్ కు సీసీ కెమెరాలు, సోలార్ కంచే వ్యవస్థలు కూడా ఏర్పాటుచేయనున్నారు.

చిత్తూరు, కడప జిల్లాల్లో సంయుక్తంగా శ్రీ వెంకటేశ్వర అభయారణ్యం 87,000 ఎకరాల్లో విస్తరించి అరుదైన వన్య, జీవ, వృక్ష జాతులకు నిలయంగా 'బయో రిజర్వు' ప్రాంతంగా గుర్తింపుపొందింది.

కడప జిల్లాలో లంకమల అభయారణ్యం 46,442.82 హెక్టార్లలో విస్తరించి ఉంది. ప్రొద్దుటూరు, బద్వేలు, సిద్ధవటం క్షేత్రాలతో కల్సి ఉంది. అలాగే పెనుశిల నరసింహస్వామి అభయారణ్యం కడప, నెల్లూరు జిల్లాల్లో కలిసి 1,13,770.48 హెక్టార్లలో విస్తరించి ఉంది. సోమశిల, కడలేరు జలాశయాలు దీని పరిధిలోనే ఉన్నాయి.

ఈ ప్రాంతాల అభయారణ్యంలోని అరుదైన వన్య ప్రాణులను, జంతుజాలాన్ని, వృక్షజాతుల్ని ప్రధానంగా ఎర్రచందనం వృక్షాల్ని కాపాడడం కోసం 2014 సం॥ నుంచి అనుమతి లేకుండా ప్రవేశాలను నిషేధించారు. 144 సెక్షన్లు విధించారు. అటవీ సంరక్షణ చట్టం 1980, ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం 1967 (20వ సెక్షన్) ప్రకారం ఉత్తర్వులను ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకుంటారు.

ఎర్రచందనం స్మగ్లర్లపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తారు. స్మగ్లింగ్ చేస్తూ మొదటిసారి పట్టుబడితే 5 సం॥రాల జైలుశిక్ష, మూడు లక్షలకు తక్కువ కాకుండా జరిమానా విధిస్తారు. రెండవసారి పట్టుబడితే 7 సం॥రాలు జైలు శిక్ష ఐదులక్షలకు తక్కువ కాకుండా జరిమానా విధిస్తారు.

ఎర్రచందనం మినహా మిగిలిన అటవీ నేరాల్లో చిక్కినట్లు అయితే మొదటిసారి నేరానికి మూడు నెలలు జైలు శిక్ష, ఐదువేలకు తక్కువ కాకుండా జరిమానా, రెండవసారి పట్టుబడితే సంవత్సరం జైలు శిక్ష, ముప్పైవేలు జరిమానా విధిస్తారు. ఆస్తులను కూడా జప్తు చేయవచ్చు. ఈ మార్పులతో కూడిన అటవీ చట్ట సవరణలకు రాష్ట్ర మంత్రివర్గం 2015 ఏప్రిల్ 22వ తేదీన ఆమోదముద్ర వేసింది. అటవీశాఖ అధికారులు కూడా రాష్ట్ర వైల్డ్ లైఫ్ వార్డెన్ నుంచి అనుమతి పొందిన తర్వాతనే అడవిలోకి వెళ్లాలని నిబంధన విధించారు.

భారతదేశంలో జీవవైవిధ్యాన్ని పరిరక్షించేందుకు పార్లమెంటు 2002లో జీవ వైవిధ్య చట్టాన్ని ఆమోదించింది. రాష్ట్రంలో 2006లో జీవ వైవిధ్య మండలిని

ఏర్పాటు చేశారు. జీవ వైవిధ్యాన్ని నాశనం చేసిన వారిని బెయిల్ కు వీల్లేని వారెంట్లతో అరెస్ట్ చేస్తారు. చిత్తూరు, కడప జిల్లాల్లో 4756 చ.కి.మీలలో విస్తరించి జీవ వైవిధ్యం కల్గి ఉన్న ప్రాంతాన్ని 2010లో కేంద్ర ప్రభుత్వం 'శేషాచల బయో రిజర్వు'గా ప్రకటించింది.

శేషాచలం అడవుల్లోని తిరుమల కొండల్లో 108 తీర్థాలున్నాయి. వీటిని 108 మంది రుషులకు ప్రతీకలుగా భావిస్తారు. ఈ తీర్థాల నీటి వసతి ఆధారంగా పెరిగే ఎర్రచందనం చెట్లు అతి పవిత్రమైనవని, రామాయణంలోని అరణ్యకాండలో 73వ సర్గలో వీటి ప్రస్తావన ఉందని చెప్తారు. మాతంగ మహర్షి వీటిని పెంచి పోషించాడని ఒక విశ్వాసం. దీనిని కీలకాంశంగా చేసుకొని ఎర్రచందనం చెట్ల పవిత్రతను వివరించి, వీటిని నేలకూల్చకుండా తగిన ప్రచారం చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం భావిస్తోంది. శేషాచలం అడవుల్లోని ఎర్రచందనం వృక్షాలను కాపాడడం కోసం, అక్రమ రవాణా అరికట్టడానికి, స్మగ్లర్లను అణిచివేయడానికి ప్రత్యేక కార్యాచరణ దళంగా RSASTF (Red Sanders Anti Smuggling Task Force) ఏర్పాటైంది. దీనికి అధిపతిగా డీఐజీ స్థాయి అధికారిని నియమించారు. తిరుపతిలోనే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ప్రధాన కార్యాలయం ఉంది. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక కార్యదళం (టాస్క్ ఫోర్స్) డీఐజీగా ఎం. కాంతారావు నియమితులయ్యారు.

దేశంలో ఎక్కడ ఎర్రచందనం కనిపించినా, అక్రమంగా రవాణా అవుతున్నా, పట్టుబడినా సమాచారం అందించేందుకు టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

2011 సంవత్సరంలో కడప జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్లుగా పేరుపొందిన రామాపురానికి చెందిన శ్రీనివాసులు, కిరణ్ కుమార్ రెడ్డి, భాజీపేట మండలానికి చెందిన గండిరెడ్డి అలియాస్ రాజేష్ కుమార్ రెడ్డి పై పీడీ చట్టం ప్రయోగించి జైలుకు పంపారు. పులివెందుల ప్రాంతంలో తేర్నంపల్లిరెడ్డి, రాజంపేట ప్రాంతంలో కట్టా శ్రీనివాసులనాయుడు అరెస్ట్ కాబడ్డారు. రాయచోటి ప్రాంతంలోని రెడ్డి నారాయణ, మహేష్ నాయుడు, రెడ్డప్ప రెడ్డి, సుబ్రమణ్యం అలియాస్ బుల్లెట్ మణి (తిరుత్తణి) అయ్యప్ప (చెన్నై) లను వదిలిపెట్టే ప్రశ్నేలేదని అప్పటి కడప ఎస్పీ తరుణ్ జోషి ప్రకటించారు.

టి. సుండుపల్లె మండలం చప్పిడివాండ్ల పల్లెకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ మహేష్ నాయుడును జైలులోనే ఉంచాలని 2011 జూన్ 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. 2009 డిసెంబరులో అప్పటి కడప కలెక్టర్ శశిభూషణ్ కుమార్ మహేషనాయుడుపై పీడీ చట్టం ప్రయోగించాలని అటవీ అధికారులను ఆదేశించారు. చివరికి పోలీసులకు కాకుండా తిరుపతి కోర్టులో లొంగిపోయాడు. మరో స్మగ్లర్ రెడ్డినారాయణను చిత్తూరు జిల్లా వాయల్పాడు (వాల్మీకిపురం) కోర్టులో 2011 జూలై 6వ తేదీ హాజరుపర్చారు. పీలేరు రేంజిలోని వివిధ ప్రాంతాలతో పాటూ కడప జిల్లాలోనూ ఇతనిపై పలు కేసులు నమోదై ఉన్నాయి.

2007లో రెడ్డినారాయణ, ఆయన అనుచరుడు మహేష్ నాయుడులను అదుపులోకి తీసుకోవాలని అప్పటి ఎస్పీ నాగిరెడ్డి ప్రయత్నించి కేసులు కట్టారు. రాయచోటి అర్బన్ సీఐగా పనిచేసిన రామచంద్రారెడ్డి, రూరల్ సీఐగా పనిచేసిన ఖాసీం సాహెబ్, లక్కిరెడ్డిపల్లె సీఐగా పనిచేసిన సోమన్నతో పాటూ మరో ముగ్గురు ఎస్సైలు 'సహకరిస్తున్న' కారణంగా సస్పెన్షన్ కు గురయ్యారు.

అనంతపురం మీదుగా ఢిల్లీ, ముంబాయి ప్రాంతాలకు ఎర్రచందనాన్ని స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను 2011 అక్టోబర్ 5వ తేదీ డీఎస్పీ కోలార్ కృష్ణ అనంతపురంలో

పట్టుకున్నారు. కడప జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఎర్రచందనం దుంగల్ని తాడిపత్రి లోని ఒక తోటలో ఉంచి, అక్కడ్నుంచి తరలించే క్రమంలో పోలీసులు ముఠాను అదుపులోకి తీసుకున్నారు. కర్నూలు జిల్లా ముత్యాలపాడుకు చెందిన కొండపల్లి బాబా అలియాస్ వలి, రాయచోటికి చెందిన మాకుల సుబ్రహ్మణ్యం, తమిళనాడు తిరువళ్లూరు'కు చెందిన ఇంద్ర కుమార్, చోళపరానికి చెందిన ఆర్. శరవణన్, పాడి నెల్లూరుకు చెందిన సతీష్, ఆర్. సెల్వం, రెడ్ హిల్స్ కు చెందిన వేలు పాండ్యన్, రాజా, చెన్నైకి చెందిన శేఖర్ మణికంఠన్, రెడ్ హిల్స్ కు చెందిన వేలాయుధ చంద్రశేఖర్లు అరెస్ట్ అయ్యారు. 8.55 టన్నుల ఎర్రచందనంను స్వాధీనం చేసుకున్నారు.

చిత్తూరు జిల్లా పీలేరు, భాకరాపేట, ఎర్రావారిపాళెం, రంగపేట, మంగళం అటవీ ప్రాంతాల్లో ఎర్రచందనంను స్మగ్లింగ్ చేయడంలో పేరున్న 42 సం।।రాల దుర్గం సుబ్రహ్మణ్యంపై 2006లో పీడీ యాక్ట్ అమలులో ఉంది. ఇతనిపై చిత్తూరు జిల్లాలో 10 కేసులు, రాజంపేటలో 4 కేసులున్నాయి. 2012 జనవరి 27వ తేదీ పులిచర్ల మండలం పాపిరెడ్డిపల్లె వద్ద అరెస్ట్ చేశారు.

కడప జిల్లాలో మైదుకూరు మండలంలోని జాండ్లవరం గ్రామానికి చెందిన మాచుపల్లి శ్రీనివాసులు అలియాస్ శ్రీనివాసుల నాయుడు పేరు పోలీసుల రికార్డుల కెక్కింది. ఎర్రచందనాన్ని సరిహద్దులు దాటించడంలో పేరు పొందిన రేణిగుంటకు చెందిన ప్రధాన స్మగ్లరు టి. వెంకటరెడ్డిని 2013 సెప్టెంబరు 21వ తేదీ డీఎఫ్వో శ్రీనివాసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎర్రచందనం దుంగలను బెంగుళూరుకు తరలిస్తున్న సునీల్ గ్యాంగ్ ను ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు 2014 ఆగస్టు 3వ తేదీ అరెస్ట్ చేశారు. వీరితో పాటూ 64 దుంగలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఎర్రచందనాన్ని ముంబాయిలోని ఓడరేవునుంచి కంటైనర్ల ద్వారా దుబాయ్ పంపుతున్న విషయాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) గుర్తించి 13 కంటైనర్లలో ఉన్న 200 టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకొని సూత్రధారి 'అజిత్సాతమ్'ను అరెస్ట్ చేశారు.

కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని ఎర్రచందనం దుంగల్ని తమిళనాడుకు చేర్చి విదేశాలకు తరలించే స్మగ్లరు 60 సం॥రాల మలియక్కల్ మూసను నెల్లూరు డీఎఫ్ వో రాంబాబు 2014 సెప్టెంబర్ 22వ తేదీ తమిళనాడులో అరెస్ట్ చేశారు. మూసపై పదికి పైగా కేసులున్నాయి. అంతర్జాతీయ స్మగ్లర్, పుల్లంపేట మండలానికి చెందిన కొల్లం గంగిరెడ్డిపై 27 కేసులు నమోదైయ్యాయి. 14 కేసుల్లో విచారణ కూడా జరిగింది. మూడు కేసుల్లో శిక్షలు పడ్డాయి. ఒక హత్య కేసులో రెండు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి బెయిల్ పై విదేశాలకు పారిపోయాడు. తప్పుడు గుర్తింపు కార్డుతో పాస్ పోర్ట్ సంపాదించి విదేశాలకు పారిపోయాడు. పాస్ పోర్టు రద్దు అయింది. దుబాయ్ కేంద్రంగా పనిచేస్తున్న స్మగ్లర్ సాహుల్ హమీద్ ద్వారా వీసా సంపాదించి గంగిరెడ్డి మారిషస్‌కు చేరుకున్నాడు.

. . .

ఢిల్లీ కేంద్రంగా ఎర్రచందనం స్మగ్లింగ్ నిర్వహిస్తున్న లక్ష్మణన్, కర్నాటక లోని కటికనహళ్లికి చెందిన మరో స్మగ్లర్ హమీద్ అతడి అనుచరులు రియాజ్, ఫయాజ్‌ల పేర్లు బయటికొచ్చాయి. వారిపై పోలీసులు దృష్టి పెట్టారు. చిత్తూరు, కడప, నెల్లూరు, కర్నూలు ప్రాంతాల్లోని స్థానిక స్మగ్లర్ల నుంచి వీళ్లు మొదటి శ్రేణికి చెందిన ఎర్రచందనాన్ని కొనుగోలు చేస్తారు. హాంకాంగ్, చైనాలాంటి దేశాలకు తరలిస్తున్నారు. బర్మానుంచి భారతదేశానికి వచ్చిన విక్రమ్, శర్వణన్‌లు కూడా పూర్తిస్థాయిలో ప్రధాన నగరాల్లో స్మగ్లింగ్ స్థావరాలు ఏర్పాటుచేసుకొని తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకుంటూ పోయారు.

2014 సెప్టెంబర్లో పోలీసులకు చిక్కిన రాజేంద్రన్ అలియాస్ సెల్వరాజ్ చెన్నై రాయపురానికి చెందిన వ్యక్తి. చెన్నై కేంద్రంగా పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, మణిపూర్, బెంగుళూర్ ప్రాంతాల స్మగ్లర్లతో కలిసి అక్కడి నుంచి దుబాయ్, చైనా, జపాన్, నేపాల్, మయన్మార్ ప్రాంతాలకు ఎర్రచందనాన్ని రవాణాచేసే నెట్వర్క్ ఉన్నట్లు రాజేంద్రన్ అంగీకరించాడు.

2015 ఏప్రిల్ 20వ తేదీన భూటాన్ సరిహద్దుల్లోని పశ్చిమ బంగ రాష్ట్రంలోని అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ సౌందర్ రాజన్ అంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నైకి చెందిన గోవిందన్, శరవణన్లు ఇచ్చిన సమాచారంతో ఈ దాడి చేశారు. అక్కడే ఎనిమిది టన్నుల ఎర్రచందనం, చెన్నైలో 4.5 టన్నుల ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు.

2015 ఏప్రిల్ 21వ తేదీన చెన్నై పాడి నెల్లూరుకు చెందిన స్మగ్లర్ శరవణనను పోలీసులు పట్టుకున్నారు. చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో చెన్నై క్రాస్ వద్ద వాహనాల తనిఖీలో 11 ఎర్రచందనం దుంగలతో పాటూ, శరవణన్ చిక్కాడు.

కర్నూలు జిల్లాలోని చాగలమర్రి మండల పరిషత్ అధ్యక్షుడు మస్తాన్ వలిని ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా కేసులో పోలీసులు 2015 ఏప్రిల్ 13వ తేదీ అరెస్ట్ చేశారు. ముత్యాలపాడు గ్రామానికి చెందిన మస్తాన్ తిరుపతి నుంచి

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ సంపాదించిన దాంతో సినిమా రంగంలోకి కూడా అడుగుపెట్టాడు. హీరోయిన్ 'నీతూ అగర్వాల్'తో 'ప్రేమ ప్రయాణం' అనే సినిమా తీశాడు. లావా దేవీలలో ఆమెకు కూడా సంబంధాలు ఉండడంతో ఏప్రిల్ 26వ తేదీ నీతూ అగర్వాల్ అలియాస్ వినీత అగర్వాల్ అలియాస్ సీమను కర్నూలు జిల్లా ఉలిందకొండ క్రాస్ వద్ద ఆమెను అదుపులోకి తీసుకున్నారు. 2013లో తనకు మస్తాన్‌తో వివాహం అయినట్లు ఆమె వెల్లడించారు.

కడప జిల్లా రాయచోటికి చెందిన శ్రీనివాసరాజు అనే స్మగ్లర్ ఇచ్చిన సమాచారంతో చైనా దేశం సిచ్ వాన్ ప్రావిన్స్ కు చెందిన యాంగ్ పెన్ ను వ్యూహాత్మకంగా 2015 మే 8వ తేదీ హైదరాబాద్ – వరంగల్ రహదారి వద్ద చిత్తూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఘటకేసర్ టోల్ ప్లాజా వద్ద పదహైదు టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం కొనుగోలు కోసం ఇప్పటి వరకు మూడుసార్లు యాంగ్ పెన్ ఇండియాకు వచ్చినట్లు చెప్పాడు.

హరియానాలోని హిస్సార్ కు సమీపంలోని మంగలి గ్రామంలో ఎర్రచందనం స్థావరాల్ని ఏర్పాటుచేసిన అంతర్జాతీయ స్మగ్లర్ ముఖేశ్ బదానియాను 2015 మే 17వ తేదీ అదుపులోకి తీసుకున్నారు. ఏడుటన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణా చేయడంలో మధ్యవర్తి పాత్ర పోషించే వేణుంబాక సుదర్శన్ ను నెల్లూరులో పట్టుకున్నారు.

మేడ్చల్ మండలం రావలికోల్ గ్రామానికి చెందిన మాజీ రౌడీ షీటర్ గూడూరు మాధవరెడ్డిని ఎర్రచందనం అక్రమ రవాణా కేసులకింద 2015 మే 15వ తేదీ నెల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఢిల్లీనుంచి రెండొందలఇరవై కిలోమీటర్లలో ఉన్న హిస్సార్ కు దగ్గర్లోని మంగలి గ్రామంలో ఎర్రచందనం కొయ్యను దండల రూపంలోకి భూటాన్, చైనా దేశాలకు తరలిస్తున్నట్లు స్మగ్లర్ ముఖేష్ బదానియా అంగీకరించాడు. ఐపీసీ 307, 379, 353, 120బి సెక్షన్ల క్రింద ఇతడిపై కేసులు నమోదయ్యాయి. బ్రహ్మంగారిమఠం మండలం లింగాలదిన్నె పల్లెకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ విజయ నరసింహారెడ్డి

ఇచ్చిన సమాచారం ప్రకారం బదానియాను పట్టుకోగలిగారు. బదానియా ఇచ్చిన వివరాల ఆధారంగా హైద్రాబాదులోని మేడ్చల్ రోడ్డులో ఎర్రచందనం ట్రాన్స్ పోర్టు నిర్వహిస్తున్న కరంబీర్, అజయ్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి పదకొండు దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన సుదర్శన రెడ్డి, మంగం పేటకు చెందిన మల్లికార్జున ద్వారా పద్నాలుగు కోట్లు విలువచేసే 6.6 టన్నుల ఎర్రచందనం కొనుగోలు చేసినట్లు బదానియా పోలీసుల విచారణలో వెల్లడించాడు. దుబాయ్‌లోని సాహుల్ భాయ్‌కి తాను ఎర్రచందనం విక్రయిస్తానని కూడా బదానియా ఒప్పుకున్నాడు.

ఢిల్లీ కేంద్రంగా ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్న మణిఅణ్ణన్ అలియాస్ విష్ణుభాయ్‌ని 26 మే 2015 నాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కూరగాయల, పండ్లలారీల ద్వారా ఎర్రచందనాన్ని కర్నూలు జిల్లా వెల్దుర్తిలో ఉంచిన గోదాముల్లోంచి ఢిల్లీకి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. చెన్నై రెడ్ హిల్స్ లోని మణిఅణ్ణన్ నివాసం నుంచి లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు కూడా బయటపడింది.

యాత్రికుల ముసుగులో బస్సులో ప్రయాణం చేస్తూ వస్తున్న తమిళ కూలీలు 72 మందిని 29 మే 2015 నాడు చిన్నమండెం పోలీసులు పట్టుకున్నారు. వీరందరూ సేలం, విల్లుపురం ప్రాంతానికి చెందినవారు. కుప్పం – పలమనేరు ప్రాంతంలో నిల్వ ఉంచిన డంపనుంచి 77 కొయ్యాలతో పాటూ 27 గొడ్డళ్లు, 20 రంపాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. పది రోజులకు సరిపడ బియ్యం, కందిపప్పు, తదితర ఆహార పదార్థాలు కూడా బస్సులోనే ఉండడం విశేషం. వీరందరిని కడప కేంద్ర కారాగారంకు తరలించారు. దీంతో ఇప్పటికే కేంద్ర కారాగారంలో ఉన్న తమిళ కూలీల సంఖ్య 520కి చేరుకుంది. బెయిల్ కోసం వీరందరూ ఎదురుచూస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా డీజీపీ రాముడు ప్రకటించిన వివరాలు చూస్తే – 6,500 మంది స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. 12,512 ఎర్రచందనం కొయ్యలు (240 టన్నులు) స్వాధీనం చేసుకున్నారు. 65 మంది స్మగ్లర్లపై పీడీ యాక్ట్ పెట్టారు. 576 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

చిత్తూరు జిల్లా నాగపట్ల అటవీప్రాంతం కేంద్రంగా ధర్మపురి, జవ్వాదిమలై, పోరూరు ప్రాంతాలకు చెందిన తమిళ కూలీలు ఎర్ర చందనం స్మగ్లింగులో ప్రధాన పాత్ర వహిస్తూ వచ్చారు. తమిళనాడు తిరువల్లూరు జిల్లా తిరుత్తణికి చెందిన జయప్రకాష్, సెంద్రాయనపాళెంకు చెందిన నటరాజ్, స్మగ్లర్ గిరిబాబులను కడప జిల్లా రైల్వే కోడూరు సమీపంలోని మాధవరం పోడు రైల్వేగేటు వద్ద పోలీసులు పట్టుకున్నారు. వీరు దాదాపు 700 టన్నుల ఎర్రచందనం స్మగ్లింగు చేసినట్లు తెలిసింది.

తమిళనాడులోని తిరువల్లూరు జిల్లా గుమ్మడిపూడికి చెందిన రాజకీయ నాయకుడు వేణుకు ప్రధాన అనుచరుడిగా వున్న ఎర్రచందనం స్మగ్లర్ గుణశేఖర్‌ను సెప్టెంబర్ 21, 2016 నాడు పోలీసులు అరెస్ట్ చేశారు. దాదాపు 200 టన్నుల ఎర్ర చందనం వీరు తరలించినట్లు బయటపడింది.

అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ లక్ష్మణ్ చెన్నై కేంద్రంగా, అతడి భార్య సంగీత చటర్జీపై పలు కేసులు నమోదయ్యాయి. చెన్నైకి చెందిన స్మగ్లర్ మోజెస్ ద్వారా పది కోట్లకు పైగా చెల్లింపులు జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది.

వీరప్పన్ అనుచరుడైన అస్లాంఖాన్‌ను 2016 డిసెంబర్ 28వ తేదీన

కడప జిల్లా లక్కిరెడ్డి పల్లె పోలీసులు అరెస్ట్ చేశారు. దాదాపు 500 టన్నుల ఇతడు అక్రమ రవాణా చేసినట్టు తెలిసింది. చెన్నైకి చెందిన స్మగ్లర్లతో కలిసి 1999 నుంచి ఇతను ఇదే వ్యాపారంలో ఉన్నట్లు గుర్తించగలిగారు.

కడప జిల్లా ఒంటిమిట్ట చెరువుకు ఎగువన చెర్లోపల్లి రైతుల పొలీలకు దగ్గర్లో వున్న నీటి గుంతలో ఫిబ్రవరి 18, 2018 నాడు ఐదు శవాలు బయటపడ్డాయి. తిరుపతి వైపు నుంచి వస్తున్న తమిళనాడుకు చెందిన లారీలో పెద్ద సంఖ్యలో వస్తున్న తమిళ కూలీలను పోలీసులు వెంబడించడంతో చెర్లోపల్లి వద్ద లారీ ఆపి వారందరూ వారందరూ పరారైనట్టు సమాచారం. ఎటు పారిపోయారో అర్థంకాని చీకట్లో తమిళ కూలీలు – మురుగేషన్ (42), జయరాజ్ (25), కరప్పనన్ (23), చిన్నప్పయన్ (45), మురుగేశన్ (41) గా గుర్తించారు. మృతులవద్ద లభించిన బ్యాగుల్లో వున్న వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి వారి నివాస ప్రాంతాలను ధృవీకరించారు.

రాజంపేట అటవీ ప్రాంతం చింతలకోన, కలికిరి కోనలో అటవీ అధికారులకు 52 ఎర్ర చందనం దుంగలు లభించాయి. గుంపుగా తమిళ స్మగ్లర్లు దాడి చేయడానికి ప్రయత్నించారు. అటవీ అధికారులు గాలిలోకి కాల్పులు జరిపి వారిని చెదరగొట్టారు. దామోదరన్ అనే కూలీని అదుపులోకి తీసుకున్నారు.

సిద్దవటం చీటులోని చెంచల చెలమ అటవీ ప్రాంతంలో ఎర్రచందనం కొట్టడానికి వచ్చిన తమిళ కూలీని అటవీ అధికారులు పట్టుకున్నారు. మరో పదిమంది కూలీలు పరారయ్యారు. ఘటనా స్థలంలో 11 ఎర్రచందనం దుంగలు, రెండు గొడ్డళ్ళు, రెండు సెల్ ఫోన్‌లు, రంపాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కూలీలు తమిళనాడు ధర్మపురి జిల్లా వాసులు.

2019 ఏప్రిల్ 22 నాడు తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఐజి కాంతారావు గారు తమిళనాడు లోని తిరువన్నామలై జిల్లా ఎస్పీ సిబి చక్రవర్తితో సమావేశమయ్యారు. ఎర్ర చందనం కొట్టడానికి శేశాచలం అడవుల్లోకి వస్తున్న స్మగ్లర్లకు వారంట్లు జారీ చేశారు. స్థానిక జవ్వాదిమలైకు చెందిన ఐదు వందల మందికి వీటిని జారీ చేశారు. ఎర్ర చందనం పరిరక్షణకు తమిళనాడు పోలీసుల సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు.

. . .

... ఇక్కడ ఆగుదాం!

ఎప్పటికి ముగుస్తుంది ఈ అరణ్యకాండ?
రచనకు ముగింపు రాద్దామని నిర్ణయించుకున్న
ప్రతిసారీ ఎక్కడో ఒక చోట 'ఎర్ర చందనం దుంగలు స్వాధీనం'
అనే వార్త విన్పిస్తూనే వుంటుంది.
పట్టుబడిన తమిళకూలీని మధ్యలో మోకాళ్ళపైన కూర్చోబెట్టి
చుట్టూ పోలీసులు నిల్చున్న ఫోటో ఒకటి డెస్క్‌కు అందుతూనే వుంటుంది.
అడవిలో ఎర్రచందనం వుంటున్నంత కాలం
ఈ వార్తలు వుంటాయి.
రాయలసీమ జిల్లాల్లోని ఎర్రచందనం అడవులపై
దండయాత్ర జరుగుతూనే వుంటుంది.
ఎన్‌కౌంటర్లు జరుగుతూనే వుంటాయి...
తమిళ కూలీలు వస్తూనే వుంటారు.
స్మగ్లర్లు పట్టుబడుతూనే వుంటారు.
వేలకు వేల కుటుంబాలకు ఆర్థిక వనరుగా వున్న
ఎర్రచందనం ఎంతో చరిత్రను చూసింది...
చూస్తోంది...
పట్టపగలు, మిట్ట మధ్నాహ్నం, నట్టనడిరాత్రి
అడవి పుష్పించేకాలంలో నెత్తురు కారుతూనే వుంది.
ఎర్ర చందన వృక్షం తనని కాపాడమని కన్నీరు పెడ్తూనే వుంది.
వాటి అశ్రు ఘోషకు అక్షర
రూపమే ఈ పుస్తకం...
చరిత్ర ఇలా ఇక్కడ నమోదైంది.

కథ

తమిళ కూలీ

పెద్ద రావి చెట్టు కింద ఆపి వుంచిన జీపుపైన ఎండుటాకులు రాలిపడ్తున్నాయి. మానుపై వాలిన పక్షులు శబ్దం చేస్తున్నాయి.

గుంజన యేరుకు అవతల నల్లరాతికొండ వద్ద ఒక తమిళ కూలీ పట్టుబడ్డాడు, ఎర్రచందనం చెట్టు కొట్టడానికి వచ్చిన మిగిలిన కూలీలు పరారయ్యారు.

'చిక్కిన తమిళ కూలీ నుంచి చిన్న సంచిని, ఒక గొడ్డలిని స్వాధీనపర్చుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా గాలింపు చేస్తున్న బీటు ఆఫీసరుకి వీడు దొరి కాడు.

పట్టుకొచ్చి లోపలేశారు.

ఎవరు మాట్లాడుతారు...

వాడికి తెలుగు రాదు. వీళ్ళకు తమిళం రాదు. ఏదో విధంగా వాడి నుంచి సమాచారాన్ని రాబడుతున్నారు. మధ్యాహ్నం నుంచి వార్త రాసుకోవడం కోసం విలేకర్లు అక్కడికక్కడే తచ్చాడుతున్నారు. వాళ్ళందరితో పాటు నేను కూడా!

ఇంకో జీపు దుమ్మురేపుకుంటూ ఆవరణలోకి వచ్చింది. మరో ఇద్దరు అధికార్లు దిగారు. చకచకా అడుగులు వేసుకుంటూ లోపలికి వెళ్లారు. వీస్తున్న గాలికి కొమ్మలు ఊగుతున్నాయి.

కాసేపటి తర్వాత బయటికొచ్చిన బీటు ఆఫీసరు జీపులో వెనుక వైపు వున్న రెండు ఎర్రచందనం దుంగల్ని లోపలికి తీసుకురమ్మని చెప్పి కళ్ళద్దాలు సర్దుకుంటూ వేగంగా వెళ్ళిపోయాడు. సిబ్బంది వాటిని మోసుకెళ్ళారు. వాతావరణం వేడిగా వుంది. మరోవైపు స్తబ్దత. పదేపదే టైం చూసుకుంటున్నారు

చెట్టు పక్కన నిల్చున వాళ్ళు.

సెల్ పట్టుకొని కాలక్షేపంలో ఇంకొందరు.

ఆఫీసు కాంపౌండ్‌కు ఎడమ పక్కన వున్న పాత రేకుల షెడ్డులో టీ కొట్టు దగ్గరికి ఫారెస్ట్ ఆఫీసులో ప్రొటెక్షన్ వాచర్‌గా ఉద్యోగం చేస్తున్న నాగరాజు వచ్చాడు.

'దొరికిన తమిళ కూలీ ఏమైనా చెప్పాడా...' అడిగాను ఆత్రుతగా.

"ఆ..' అని అతను ఊకొట్టాడు.

"ఏం పేరంటా?'

"శివలింగం"

'ఎక్కడి నుంచి వచ్చాడో తెలిసిందా.." మళ్ళీ ప్రశ్న.

"వాడి దగ్గర చెన్నై సెంట్రల్ టూ కోడూరు వరకు వున్న జనరల్ రైల్వే టికెట్ దొరికింది"

'ఆయితే ఉదయాన్నే మెయిల్‌కు వచ్చి వుంటాడు' అన్నాను నా అభిప్రాయం వ్యక్తం చేస్తూ,

'అట్నే వుంది!" పొడిగా జవాబిస్తూ ఐదు టీలు ఆఫీసులోకి పంపించమని టీ కొట్టు వెంకట్రాముడికి చెప్పి వెళ్ళిపోతున్నప్పుడు...అడిగాను మళ్ళీ...

'తనని ఇక్కడికి ఎవరు పిలిపించారో, అతడి వెనుక వున్న పెద్ద మనిషి పేరు ఏదైనా చెప్పాడా...."

అసహనంగా చూశాడు నాగరాజు,

'కాసేపు ఆగితే ఎస్పైసారే.. మిమ్మల్నందర్ని లోపలికి పిలిచి విషయాలన్నీ చెప్తాడు' అంటూ చిరాగ్గా లోపలికి వెళ్లిపోయాడు.

త్వరగా వార్త రాసి పంపితే నా పని అయిపోతుంది. డెస్కుకు వాట్సాప్ మెసేజ్ పెట్టాను.

ఈమధ్య ఎర్రచందనం వార్తలకు బాగానే ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లా టాబ్లాయిడ్లో రెండవ పేజీలో ఇలాంటి వార్తలకే చోటు లభిస్తోంది.

చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతి, రేణిగుంట మీదుగా మామండూరు, బాలపల్లె

పరిధిలో వున్న ఎర్రచందనం కోసం రైల్వేకోడూరులోకి దిగుతున్నారు తమిళ కూలీలు.

మెయిల్ తెల్ల వారుజామున మూడున్నరకు వస్తుంది,

రైల్వేస్టేషన్‌లో దిగడం కొండదారెంబడి సాగిపో వడం ఎంతోకాలంగా సాగుతోంది.

ఒక్కోసారి గుంపులు గుంపులుగా కూడా దిగుతుంటారని అక్కడుండేవారు చెప్తుంటారు.

వీళ్ళందరూ ఎందుకిలా వస్తున్నారు...?

బతకలేనితనం వారిని కూలీలుగా మారుస్తోంది. వీరి వెనుక నుండి నాటకం అంతా నడిపించే స్మగ్లర్లు ఎక్కడో విదేశాల్లో విలాసాలు అనుభవిస్తూ వుంటారు. కడపాత్రంతో గొడ్డలి చేతబట్టి భయంక రమైన అడవుల్లోకి ఎర్రచందనం కొట్టడానికి వస్తున్న కూలీల బతుకు దుర్భరం.

క్షణక్షణం భయంభ యంగా జీవించాలి.

ఇంటికి తిరిగి క్షేమంగా చేరగలమో లేదో కూడా తెలియదు, తెగిస్తున్నారు.

ఇట్నుంచి పదకొండు కిలోమీటర్లు ముందుకెళ్లే శేషాచలం అభయారణ్యంలో భాగమైన శ్రీవెంకటేశ్వర అభయారణ్యం మొదలవుతుంది. అటే ముందుకు సాగితే కుక్కలదొడ్డి అనే ప్రాంతం వస్తుంది. అక్కడి నుంచి పదికిలోమీటర్ల దూరంలో వున్న తుంబరతీర్థం చేరుకుంటే అడవిలోకి దారులు ఏర్పాటు చేయబడివున్నాయి, పచ్చటి ప్రకృతిలో ఎత్తైన ఎర్ర చందనం చెట్ల దారుల్లో ప్రయాణం సాగిస్తే కోనలెన్నో పలుకరిస్తాయి. వలసకోన, చాకలి రేవు కోన, ముతరాచకోన, కాశి కోన, తలకోనలు ఆడవిపాటను నేర్పుతాయి.

గుంజనేరు దగ్గర ఏనుగుల మందలు సంచరిస్తుంటాయి. వాన కురిసేటప్పుడు యుద్దారాల తీర్థం అందాలు చూడ్డానికి రెండు కళ్ళు చాలవు.

విష్ణుగుండం పొంగి పొర్లుతోంది.

ఇంత ప్రకృతి విధ్వంసానికి గురవుతున్న నేటి దృశ్యం హృదయ విదారకరం.

విలేకర్లను లోపలికి పిలిచారు.

సెల్ లోపల రెండు చేతులూ, రెండు కాళ్ళూ తాడుతో కట్టివేయబడివున్న తమిళకూలీ శివలింగం కన్పిస్తున్నాడు. ముఖమంతా కమిలిపోయి వుంది.

కింద పెదవి పగిలి నెత్తుటి చారలు చూపిస్తోంది.

మాసిపోయి చినికిపోయి వున్న చొక్కా ఎర్రటి దుమ్ము నిండి రంధ్రాలు పడివున్న ప్యాంటు, ఈదురు గాలికి కొట్టుకొచ్చి పడివున్న వాడిలాగా కన్పిస్తున్నాడు. భరించలేనంత వాసన వేస్తోంది.

కళ్ళు లోతుకు పోయి వున్నాయి.

దువ్వని జుట్టు దుమ్మును మోస్తోంది.

ఎక్కడి పక్షి మరెక్కడికో వలస వచ్చి బంధించబడినట్లున్నాడు.

పగుళ్ళుబారిన శరీర చర్మం. గారపట్టిన దంతాలు. నల్లటిదేహం.

ఆడవిలో దొరికిన మృగాన్ని కటకటాల్లో బంధించినట్లు వాడున్నాడు.

శివలింగంకు కట్టిన తాడు విప్పారు.

వాడు లేవలేని స్థితిలో వున్నాడు.

వాడి దగ్గరి నుంచి స్వాధీనం చేసుకున్న పాత పసు పురంగు సంచి. దానికి సుబ్రహ్మణ్యస్వామి చిత్రం ముద్రించి వుంది. అందులో ఒక సిల్వర్ టిఫిన్ క్యారీ, నాలుగు గుట్కా ప్యాకెట్లు వున్నాయి.

దానితో పాటే వాడు ఉపయోగించే గొడ్డలి.

ఇవి స్వాధీనం చేసుకున్న వస్తువులు. వాడు కొడుతుండగా పట్టుకున్న రెండు ఎర్రచందనం దుంగలు.

సిబ్బంది ప్రెసకు ఇవ్వాల్సిన ఫొటో కోసం ఏర్పాట్లు చేస్తున్నారు.

శివలింగం బాధగా ప్రాధేయపూర్వకంగా దాహమేస్తున్నట్లు సైగ చేశాడు. అక్కడ మూలగా వున్న మట్టి కుండలో వున్న నీళ్ళను కూడా లేచి వెళ్లి తాగలేని స్థితి.

ఎవరో గ్లాసుతో అందించారు.

గడగడ తాగి వాడు ఊపిరి పీల్చుకున్నాడు.

శివలింగం దగ్గర దొరికిన రైల్వేటికెట్లు చూపించాడు అటవీ అధికారి.

చెన్నై సెంట్రల్ టూ కోడూరు అని అందులో రాసి వుంది.

జనరల్ టికెట్. విలేకర్లు ఫొటో తీసుకున్నారు.

'వివరాలు చెప్పండి సార్! వార్త రాసుకోవాలి..." పక్కనున్న మరో విలేకరి కొంత ఆసక్తిగా అడిగాడు.

ఆటవీ అధికారి చిన్నగా నవ్వాడు.

'ముందు టీ తీస్కోండి. చల్లారిపోతుంది' అంటూ బదులిచ్చాడు.

మేమందరం తాగుతుంటే శివలింగం మావైపే చూస్తున్నాడు,

'ఆతడికి కూడా టీ ఇప్పించండి సార్ ఎవరో వెనక నుంచి అన్నారు.

ఇమ్మన్నట్లు అధికారి సైగ చేశాడు. అతడికీ టీ ఇచ్చారు.

అధికారి చెప్పడం ప్రారంభించాడు.

'పట్టుబడిన తమిళకూలీ పేరు శివలింగం. తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా మురగంబాడి గ్రామానికి చెందినవాడు. ఇతడి వయసు ముప్పై సంవత్సరాలు. తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తల్లి పెంపకంలో పెరిగాడు. పదో తరగతిలోనే చదువు మానేశాడు. ఇతడి భార్య పేరు మునీయమ్మాళ్. ఇతడికి నాల్గవ తర గతి చదువుతున్న కూతురు వుంది. పేరు రేవతి'

పై ఫ్యాను వేగంగా తిరుగుతోంది.

టేబుల్ పైన వున్న కాగితాలు గాలికి కదులుతు న్నాయి.

తాగడం పూర్తి కావడంతో కప్పును దూరంగా పెట్టాడు. మీసాలు సవరించుకున్నాడు అధికారి..

'ఎర్రచందనం చెట్టుకొట్టే పని ఎవరు ఇతనికి అప్ప గించారు ?' మరొక ప్రశ్న వేశారు.

'ఆదే చెప్పబోతున్నాను' అంటూ కళ్ళు ఎగరేశాడు అధికారి.

'శివలింగం వూర్లో వండేటప్పుడు ఆటో నడుపుకుంటూ జీవించేవాడు. ఇతడికి టింబర్ డిపోలో పనిచేసే మాణిక్యంతో పరిచయమైంది. అతడి పని ఏమిటంటే

మన ప్రాంతంలో ఎర్రచందనం చెట్లను కొట్టడానికి కావలసిన మనుషులను సప్లై చేయడం.

ఏజెంట్‌గా వ్యవహరిస్తాడు.

ఇలాంటి ఏజెంట్లు అక్కడ చాలామంది వుంటారు. వారే కూలీలను స్మగర్లకు సమకూర్చి పెడతారు. విదేశాల్లో పండే స్మగర్లకు ఇక్కడ స్థానికంగా ఉండేవాళ్ళూ, రాజకీయనాయకులూ సహకరిస్తుంటారు.

వ్యవహారమంతా గొలుసు పద్ధతిలో సాగుతూ ఉంటుంది"

అధికారి సెల్ ఫోన్ మోగింది.

అతడి పై ఆఫీసర్ నుంచి వచ్చినట్లుంది.

కోరిన వివరాలు సాయంత్రంలోగా పంపిస్తానని అంటున్నాడు.

భాష అర్థం కాకపోయిన అధికారి చెప్పే మాటలన్ని తలొంచుకొని వింటున్నాడు శివలింగం.

మాణిక్యం అనే పేరు వచ్చినప్పుడల్లా శివలింగం కళ్ళు ఎరుపెక్కుతున్నాయి. ఆవేశంగా చూస్తున్నాయి.

తన జీవితం జైలు పాలు కావడానికి అతడే కారణమని కావచ్చు ఏజెంటు మాటలు నమ్మి ఆడవిబాట పట్టి కష్టాలు పడుతున్న వైనం శివలింగాన్ని కుదురుగా ఉండనివ్వడం లేదు. మాణిక్యం కనిపిస్తే తను వెంట తెచ్చుకున్న గొడ్డలితోనే సమాధానం ఇచ్చేటట్లున్నాడు.

గట్టిగా తాడుతో కట్టివేయడం వల్ల ఆతడి చేతులు వాతలు పడినట్లు చారలు కమిలిపోయి కన్పిస్తున్నాయి. బయట చెట్టుపైన పక్షుల శబ్దం ఆగిఆగి విని స్తోంది.

అధికారి మళ్లీ చెప్పడం మొదలుపెట్టాడు.

'ఆంతర్జాతీయ మార్కెట్టులో ఎర్రచందనానికి విపరీతమైన డిమాండ్ ఉంది. అందువల్లనే స్మగ్లర్లు ఎంతకైనా తెగిస్తున్నారు. తమిళనాడులో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వారి ద్వారా కూలీలను సమకూర్చుకుంటున్నారు. వాటాలు తీసుకుంటున్నారు."

'చూస్తున్నారు కదా.... ఇక్కడ కూలీలను పట్టుకుంటున్నాం, మధ్యలో ఏజెంట్లను పట్టుకున్నాం. అక్కడ స్మగ్లర్లను పలేసి పట్టుకున్నాం. అయినా సమస్య ఇంకా ఉంటుంది'

తాగిన టీకప్పులన్నీ చెత్తబుట్టలోకి చేరాయి,

"ఏదైనా అడగాలనుకుంటే అడగవచ్చు' అన్నాడు అధికారి కుర్చీలో వెనక్కి వాలుతూ,

శివలింగాన్ని ఎక్కడ పట్టుకున్నారు? "గుంజన యేరుకు అవతల నల్లరాతి కొండ వద్ద

'ఎప్పుడు?"

'నిన్న సాయంత్రం'

'ఒక్కడే దొరికాడా?'

'అవును. మిగిలిన అయిదుమంది పరారయ్యారు. వారి కోసం గాలిస్తున్నాం.

రైల్వేటికెట్ పైన తేదీ చూస్తే శివలింగం వచ్చి పది రోజులు దాటుతోంది కదా!

"అయ్యి ఉండవచ్చు. మాకైతే నిన్న సాయంత్రమే పట్టుబడ్డాడు"

నీళ్లు తాగి గ్లాసుకింద పెట్టాడు అధికారి.

మీ కస్టడీలో ఎన్నిరోజుల నుంచి ఉన్నాడు? మరో ప్రశ్న వాలింది.

జవాబు లేదు.

ఫొటో కార్యక్రమం.

శివలింగాన్ని మోకాళ్ళ పైన మధ్యలో నిల్చోబెట్టారు. చేతులు కట్టుకొని ఉన్నారు. అతడి వెనుక అటు నలుగురు ఇటు నలుగురు ఆటవీ సిబ్బంది నిల్చున్నారు.

శివలింగం ముందు రెండు ఎర్రచందనం కొయ్యలు, గొడ్డలి అతడి పాత సంచి ఉంచారు.

ఫొటోలు చకచకా తీసుకున్నారు..

'కాసేపు అతడితో మాట్లాడించండి సార్!' అని అన్నాను ఆధికారితో,

'ఎందుకబ్బా!' అన్నట్లు చూశాడు.

'అతను తమిళంలో మాట్లాడుతాడు...మీకు అర్థం అవుతుందా?' అని సన్నగా నవ్వుతూ అన్నాడు ఆధికారి.

శివలింగం విలేకర్ల ముందుకొచ్చాడు.

'ఎనక్కు కవలైయా ఇరుక్కు

(నాకు బాధగా ఉంది)

ఎన్ నలం సరి ఇల్లై

(నా ఆరోగ్యం బాగుండడం లేదు)

ఎన్ కై ఎలుంబు మరినదదు

(నా చేతి ఎముక విరిగింది)

వాన్ ది వర మాదిరి ఇరుక్కు

(వాంతి వచ్చేలాగా ఉంది)

అని అన్నాడు కళ్ళ నిండా కన్నీళ్ళు నింపుకొని.

ఇంక చాలు వీడ్ని తీసుకెళ్ళి లోపలెయ్యండి అన్నట్లు అధికారి చూశాడు.

శివలింగం ఏదో అడగాలనుకుంటున్నట్లు సంశ యంగా చూస్తున్నాడు.

'ఈరోజు తారీఖు ఎంత సామీ?' అని దుఃఖం నిండిన స్వరంతో అడిగాడు తమిళంలోనే.

ఎవరో చెప్పారు జవాబు.

'ఈరోజు నా కూతురు పుట్టినరోజు' అంటూ ఏడుస్తూ అక్కడికక్కడే కన్నీటి సంద్రమైనాడు. బయట పెద్దరావి చెట్టు పైన అంతవరకు శబ్దం చేస్తూ ఉన్న పక్షులు నిశ్శబ్దమయ్యాయి. చెట్టు కింద ఆపి ఉంచిన జీపుపైన ఎండుటాకులు రాలి పడ్తున్నాయి.

(4నవంబర్ 2018 ఆదివారం సాక్షి అనుబంధంలో ప్రచురితం)

* * *

డా॥ వేంపల్లి గంగాధర్

'రాష్ట్రపతి భవన్'లో విశిష్ట ఆతిథ్యం అందుకున్న తొలి భారతీయ సాహితీవేత్తగా వీరు గుర్తింపు పొందారు. 2014, సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 26 వరకు వీరు రాష్ట్రపతి భవన్‌లో విడిది చేశారు. రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన పలు అంశాలపై పుస్తకాలు రాశారు. వీరి కథా సంకలనం 'మొలకల పున్నమి'కి కేంద్ర సాహిత్య అకాడమీ మొదటి యువపురస్కారం - 2011 లభించింది. ప్రసిద్ధ సాహితీవేత్త సునీల్ గంగోపాధ్యాయ చేతుల మీదుగా తామ్రపత్రం అందుకున్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి 'రాయలసీమ కథా సాహిత్యం' పై పిహెచ్‌డి, 'రాయలసీమ ఫ్యాక్షనిజం' పై ఎంఫిల్ పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం వారి రైటర్స్ ట్రావెల్ గ్రాంట్ ద్వారా 'శాంతినికేతన్'లో పర్యటించారు. దేవరశిల, గ్రీష్మభూమి, తొలితెలుగు శాసనం, పూణే ప్రయాణం, కథనం, హిరణ్యరాజ్యం, నేలదిగినవాన, మొలకల పున్నమి, నేను చూసిన శాంతినికేతన్, పాపాఘ్ని కథలు, రావణ వాహనం కథలు, అనంతపురం చరిత్ర (సంపాదకత్వం), ఎర్రచందనం దారిలో తమిళ కూలీలు, యురేనియం పల్లె (నవల) పుస్తకాలు రాశారు. సీమ గిరిజన తండాల నుంచి పడుపు వృత్తిలోకి తరలిపోతున్న మహిళల జీవన ఆక్రందనను 'పూణే ప్రయాణం' రచనలో చిత్రణ చేశారు. ఇదే ఇతివృత్తంతో రాసిన 'మైనం బొమ్మలు' కథకు అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) పురస్కారం దక్కింది. న్యూఢిల్లీ కథా ఫౌండేషన్ వారి నుంచి 'శిలబండి' కథకు జాతీయ కథాపురస్కారం, 'నేలదిగిన వాని' నవలకు అంపశయ్య నవీన్ సాహితీ పురస్కారం, 'దేవరశిల'కు రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం అందుకున్నారు. వీరి కథలు పలు భారతీయ భాషలలోకి అనువాదమయ్యాయి.

ఎర్రచందనం దారిలో తమిళ కూలీలు

డా॥ వేంపల్లి గంగాధర్

రాయలసీమ జిల్లాల్లోని ఎర్రచందనం
అడవులపై దండయాత్ర జరుగుతూనే ఉంది.
ఎప్పటికి ముగుస్తుంది ఈ అరణ్యకాండ ?
'ఎర్ర చందనం దుంగలు స్వాధీనం' అనే వార్త
దినపత్రికల్లో ఎప్పుడూ చూసే ఒక
సాధారణ దృశ్యం. పట్టుబడిన తమిళకూలీని
మధ్యలో మోకాళ్ళపైన కూర్చోబెట్టి చుట్టూ
పోలీసులు నిల్చున్న ఫోటో వార్త...
అడవిలో ఎర్రచందనం వుంటున్నంత కాలం
ఈ వార్తలు ఉంటాయి.
ఎర్రచందనం ఎంతో చరిత్రను చూసింది. చూస్తోంది.
అడవి ఆక్రందన అశ్రుఘోషకు
అక్షర రూపమే ఈ పుస్తకం.
చరిత్ర ఇలా ఇక్కడ నమోదైంది.